మంగళవారం
TUESDAY
6-10-2026
సంపుటి (Volume):2 ॥ సంచిక: (Issue): 98
జగిత్యాల JAGITIAL ॥ పేజీలు: (PAGES):12 వెల (PRICE): 2.00
Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385
నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

అరచేతిలో ఈవార్తలు దినపత్రిక
స్కాన్ చేయండి..
ఆండ్రాయిడ్ యాప్
డౌన్‌లోడ్ చేసుకోండి..
GET IT ON Google Play




# ఇంక్రిమెంట్లు లేవు



## అగ్నిమాపక శాఖలో ఉద్యోగుల జీవితాలు ఆగం

### తుగ్లక్ నిర్ణయాలకు పరాకాష్టగా 'జీవో 86'

హెవీ లైసెన్స్ ఉంటేనే ఇంక్రిమెంట్ అని మెలిక

జాయినింగ్ ఆర్డర్‌లో లేని రూల్.. జీవోతో అమలు

హెవీ లైసెన్స్ లేదని వేతన పెంపు ఆపిన సర్కారు

కొందరికి జీతాలు పెంచి, మరికొందరికి మొండిచేయి

ఫైర్ సిబ్బంది ఉసురు పోసుకుంటున్న సర్కారు



ప్రాణాలకు తెగించి మంటల్లోకి దూకే అగ్నిమాపక సిబ్బందికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం.. వారి కడుపు కొట్టేలా నిర్ణయాలు తీసుకుంటే ఏమనాలి? అగ్నిమాపక శాఖలో పనిచేస్తున్న ఫైర్‌మెన్లకు 86 జీవో గుదిబండలా మారింది. ఒకే పోస్టులో, జీతం పెంపు లేకుండానే రిటైర్మెం ట్ దాకా కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి కల్పిస్తోం ది. తెలంగాణ ప్రభుత్వం అత్యంత అనాలోచితంగా తీసుకొచ్చిన ఈ జీవోను.. కనీస క్షేత్రస్థాయి అవగాహన, సాంకేతిక పరిజ్ఞా నం లేని కొందరు అధికారులు ఏసీ గదుల్లో కూర్చుని రాసిన ఫలితం.. ఇప్పుడు ఫైర్ సిబ్బంది పాలిట ఉరితాడుగా మారింది. రెగ్యులర్ గా విధులు నిర్వర్తించే ఫైర్ ఫైటర్లకు వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలంటే కచ్చితంగా 'హెవీ డ్రైవింగ్ లైసెన్స్' ఉండాలని నిబంధన పెట్టడం ప్రభుత్వ అజ్ఞానానికి నిదర్శనం.

ఈవార్తలు ఇన్వెస్టిగేటివ్ రిపోర్ట్

మంటలార్పే ఫైర్ ఫైటర్‌కు, భారీ ఫైర్ ఇంజిన్‌ను నడిపే డ్రైవర్ కు ఉన్న వ్యత్యాసం కూడా తెలియకుండా అధికారులు ఈ జీవోను ఎలా జారీ చేశారు? అసలు ఈ ఫైల్‌పై సంతకం చేసేముందు ప్రభుత్వ పెద్దలు కనీసం సమీక్షించారా? లేదా కళ్లు మూసుకుని ఆమోదించారా? ప్రభుత్వం పెట్టిన ఈ వింత నిబంధన ఆచరణ సాధ్యమేనా? అన్న కనీస ఇంగితం -2 వ పేజీలో...




# జీతాలు రావు..!

## ఆకలి మంటల్లో ఆస్పత్రి కార్మికులు

### 4 నెలలుగా జీతాల్లేక అవస్థలు.. బిల్లులు జిల్లాలకు చేరినా చేతికి అందలే!

రోగుల ప్రాణాలు నిలబెట్టే ప్రభుత్వ ఆస్పత్రుల్లో అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల కడుపు కొడుతోంది ప్రభుత్వం. చాలీచాలని జీతాలతో బతుకీడుస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్, సూపర్ వైజర్లకు వరుసగా మూడు, నాలుగు నెలలుగా వేతనాలు నిలిపివేయడం పాలకుల అమానవీయ కోణాన్ని బట్టబయలు చేస్తోంది. కనీస వేతనాలు కూడా అందక ఆ చిరుద్యోగులు ఆకలి మంటలతో అలమటిస్తున్నారు. నాలుగు నెలలుగా జీతాలు లేకపోవడంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇంటి కిరాయిలు కట్టలేక ఓనర్లతో తిట్లు, కిరాణా షాపుల్లో సరుకులు ఇవ్వక పడుతున్న అవమానాలతో కార్మికులు తమ ఆత్మగౌరవాన్ని చంపుకుంటూ బతుకుతున్నారు

ఖమ్మం/హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): .ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం జీజీహెచ్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జీజీహెచ్, మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న కార్మికులు వేతనాలు లేక పస్తులుండలేక గత మూడు రోజులుగా రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదు. దీంతో హైదరాబాద్ కోఠిలోని టీవీవీపీ, డీఎంఈ కార్యాలయాల్లో ఎస్పీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నతాధికారులను కలిసి నిలదీయగా విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. కేవలం సెప్టెంబర్ నెలకు సంబంధించిన బిల్లులు మాత్రమే పెండింగ్ ఉన్నాయని, జులై, ఆగస్టు నెలల బిల్లులను ఇప్పటికే అన్ని జిల్లాలకు పంపామని హెడ్ ఆఫీసు అధికారులు స్పష్టం చేశారు. పైనుంచి బిల్లులు మంజూరైనా.. జిల్లా స్థాయిలో ఉన్న డీసీహెచ్‌ఎస్ అధికారులు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు కార్మికులకు ఎందుకు వేతనాలు తరువాయి 2 వ పేజీలో...

తెలంగాణ హైకోర్టు తాతాలిక ప్రధాన న్యాయమూర్తిగా సీనియర్ జడ్జి జస్టిస్ పీ శ్యామ్‌కోశీ నియమితులయ్యారు. ప్రస్తుత సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులు కావడంతో ఆయన స్థానంలో జస్టిస్ శ్యామ్‌కోశీ తాతాలిక సీజేగా బాధ్యతలు చేపట్టారు.

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,918 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,291 |

# ఫారం-6 సవరణలకు ఆమోదం లేదు

### మేం ఎలాంటి సవరణలను ఆమోదించలేదు

## సీజేఐ సూర్యకాంత్ స్పష్టీకరణ



కొత్త ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం (ఈసీ) వినియోగించే 'ఫారం 6'లో ఎలాంటి సవరణలకు తాము ఆమోదం తెలుపలేదని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. అయితే ఈ మార్పులు ఎవరు చేశారో నిర్ధారించేందుకు సంబంధిత రికార్డులను తాము పరిశీలిస్తామని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ తెలిపారు. సవరించిన ఫారం 6కు తాము ఆమోదం తెలుపలేదని, ఈ విషయంలో చాలా స్పష్టంగా ఉన్నామని ఆయన చెప్పారు.

న్యూఢిల్లీ: 'ఆ రికార్డులను సుప్రీంకోర్టుకు సమర్పించినప్పుడు 'ఫారం 6'లో ఎవరు మార్పులు చేశారో మేము చూడాలనుకుంటున్నాం' అని ఆయన అన్నారు. కాగా, మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఏకాభిప్రాయం లేకుండా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్న ఆరోపణలపై ఆయనను సస్పెండ్ చేస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. తమకు స్పందన అందేంత వరకు ఈసీ నిర్ణయాలు చట్టానికి అనుగుణంగానే ఉన్నాయని తాము భావిస్తామని ధర్మాసనం పేర్కొంది. 'ఆ నివేదిక కచ్చితమైనది కావచ్చు, కాకపోవచ్చు. కానీ దాని ఆధారంగా మేము ఉత్తర్వులు జారీ చేయలేం. మేము వారి స్పందన కోసం వేచి ఉండాలి' అని సీజేఐ సూర్య కాంత్ పేర్కొన్నారు. మరోవైపు 'ఫారం 6' అనేది 'ఓటర్ల నమోదు నియమావళి 1960'లో ఒక భాగం. దీనిని కేవలం ఒక సవరణ ద్వారా మాత్రమే మార్చడం సాధ్యమవుతుంది. అయితే 'ఫారం 6'కు ఒక అనుబంధ పత్రం జతచేయాలని 2025లో ఈసీ పేర్కొంది. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ (సర్)లో భాగంగా కొత్త తరువాయి 2 వ పేజీలో...

## తప్పుడు ఫారం-7పై

# చర్యలు

## సీఈవో సుదర్శన్ రెడ్డి ఆదేశాలు




హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): తెలంగాణ సర్-2026పై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఓటర్ల జాబితా సవరణపై తప్పుడు ప్రకటనలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఫామ్-6, 6ఏ, 7, 8లో కావాలని తప్పుడు సమాచారం ఇస్తున్న దరఖాస్తుదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల పేర్ల తొలగింపు, అభ్యంతరాల కోసం ఉద్దేశించిన ఫామ్-7లో భారీగా దరఖాస్తులు దాఖలయ్యాయి. అయితే వాటిలో కొన్ని నకిలీవని ఆరోపణలు వ్యక్తమవుతున్న తరువాయి 2 వ పేజీలో...




# ఆధార్ పేరు మార్పు..

## కొత్త మార్గదర్శకాలు జారీ!

న్యూఢిల్లీ: ఆధార్ కార్డ్‌లో పేరు, ఇతర వివరాల మార్పునకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ కీలక నిబంధనలను సవరించింది. ఆధార్‌లో పేరు మార్పు ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చేందుకు డాక్యుమెంట్ల పరంగా కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ఇకపై ఎవరైనా ఆధార్‌లో పేరు మార్చుకోవాలంటే యూఐడీఏఐ నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. వివాహం, విడాకుల అనంతరం తమ పేరు లేదా ఇంటిపేరు మార్చుకోవాలనుకునే వారు సంబంధిత అఫిడవిట్‌ను సమర్పించాలని యూఐడీఏఐ స్పష్టం చేసింది. అదేవిధంగా మైనర్, మేజర్ పేరు మార్పుల కోసం నిబంధనల ప్రకారం వేర్వేరుగా సరైన డాక్యుమెంట్లు అందించాల్సి ఉంటుంది. ఇక ఆధార్ నమోదు సమయంలో జరిగిన డేటా ఎంట్రీ లోపాలను సరిదిద్దడానికి తగిన ఆధార పత్రాలను సమర్పించాలి. ఇంగ్లిష్ నుంచి స్థానిక భాషలోకి పేరును మార్చుకునేందుకు అఫిడవిట్ ఇవ్వడం తప్పనిసరి చేశారు. పేరును పూర్తిగా మార్చుకోవాలనుకునే వారు కేంద్ర గెజిట్ నోటిఫికేషన్‌తో పాటు సరైన గుర్తింపు పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని యూఐడీఏఐ పేర్కొంది.

## విశ్వవాణి



వ్యాయామం శరీరంలో రక్తప్రసరణను పెంచడంతో పాటు మెదడులో కొత్త నాడీ సంబంధాల ఏర్పాటుకు దోహదపడుతుంది. ధ్యానం ఏకాగ్రత, ఒత్తిడి నియంత్రణ, భావోద్వేగాలకు సంబంధించిన మెదడు వ్యవస్థలపై ప్రభావం చూపుతుంది. ఈ మార్పులు కలిసి మెదడు నుంచి శరీరంలోని ఇతర వ్యవస్థలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. మెదడు, రోగనిరోధక వ్యవస్థ, జీర్ణవ్యవస్థ మధ్య నరాలు, హార్మోన్లు, రోగనిరోధక సంకేతాల ద్వారా నిరంతరం సమాచార మార్పిడి జరుగుతుంది. ధ్యానం వల్ల పేగుల్లోని సూక్ష్మజీవుల సమూహంలో మార్పులు రావచ్చని, ముఖ్యంగా పేగు ఆరోగ్యం, రోగనిరోధక చర్యలను ప్రభావితం చేసే స్వల్ప శృంఖల కొవ్వు ఆమ్లాలను ఉత్పత్తి చేసే బ్యాక్టీరియాలో మార్పులు




# రీచార్జ్ ధరల మోత!

### త్వరలో పెరగనున్న టారిఫ్‌ల రేట్లు.. టెలికం కంపెనీల యోచన

న్యూఢిల్లీ: టెలికం యూజర్ల జేబులకు త్వరలోనే పెద్ద చిల్లు పడనుంది. దేశీయ టెలికం రంగంలో పోటీ తగ్గి, మార్కెట్ స్థిరంగా ఉండటంతో రాబోయే 4 నుండి 5 నెలల్లో మొబైల్ రీఛార్జ్ ధరలను మరో 12 నుండి 15 శాతం వరకు పెంచేందుకు జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా సంస్థలు సిద్ధమవుతున్నాయి. దేశవ్యాప్తంగా 5జీ నెట్‌వర్క్ కవరేజీని వేగంగా విస్తరించడం, హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందుబాటులోకి తేవడం, కంపెనీల నెట్‌వర్క్ నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరగడమే ఈ టారిఫ్ పెంపునకు ప్రధాన కారణం. దీనికి తోడు ప్రతి వినియోగదారుడి నుండి వచ్చే సగటు ఆదాయాన్ని (ఆర్పు) పెంచుకోవాలని కంపెనీలు భావిస్తుండటంతో, నెలవారీ రీఛార్జ్ ప్లాన్ల ధరలు తరువాయి 2 వ పేజీలో...

# విద్యుత్తు చార్జీల షాక్!

### భారీగా పెరగనున్న కరెంట్ చార్జీలు

### నియంత్రణ మండలి అనుమతి జారీ



రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులకు భారీ షాక్ తగలనుంది. త్వరలోనే కరెంట్ చార్జీలు భారీగా పెరగనున్నాయి. విద్యుత్ సంస్థల సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారులపై అదనపు భారం మోపేందుకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి అధికారికంగా అనుమతిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వచ్చే నెల అంటే నవంబర్ 1 నుంచి వినియోగదారుల జేబులకు చిల్లు పడనుంది. నవంబర్ నెల నుంచి విద్యుత్ వినియోగదారుల నుంచి యూనిట్‌కు 30 పైసల చొప్పున ట్రూ-అప్ చార్జీలను వసూలు చేయనున్నారు. ఆ తర్వాత డిసెంబర్ నెల నుంచి ఈ చార్జీలను మరింత పెంచి, యూనిట్‌కు 50 పైసల చొప్పున వసూలు చేయనున్నట్లుగా తరువాయి 2 వ పేజీలో...




# కబడ్డీ విజేతలుగా నల్లగొండ, కొత్తగూడెం

### బాలుర విభాగంలో నల్లగొండ గెలుపు

### బాలికల విభాగంలో కొత్తగూడెం విన్

### విజేతలకు పొన్నం, ఆది ట్రోఫీల అందజేత

వేములవాడలో నాలుగు రోజులుగా ఉత్కంఠభరితంగా సాగిన రాష్ట్రస్థాయి బాలుర, బాలికల కబడ్డీ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. బాలుర విభాగంలో నల్గొండ జట్టు విజేతగా నిలవగా, బాలికల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జట్టు టైటిల్‌ను కైవసం చేసుకుంది.

రాజన్న సిరిసిల్ల/వేములవాడ అర్బన్, అక్టోబర్ 5 (ఈవార్తలు): వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 1,300 మందికి పైగా క్రీడాకారులు, కోచ్‌లు, ఫిజియోలు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు. బాలుర విభాగంలో జరిగిన తుది పోరులో నల్గొండ జట్టు వనపర్తి జట్టుపై విజయం సాధించింది. ప్రారంభం నుంచే వ్యూహాత్మక దాడులు, సమర్థవంతమైన పట్టివేతలతో ఆధిపత్యం ప్రదర్శించిన నల్గొండ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
6.10.2026

మేషం: బంధువులతో ఏర్పడిన వివాదాలను పరిష్కరించుకొంటారు. ఉద్యోగాలలో ఆశించిన స్థానచలనాలు ఉంటాయి. ప్రారంభించిన పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ధనవ్యవహారాలు కలిసివస్తాయి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

వృషభం: వృత్తి వ్యాపారాలలో పెట్టుబడులకు తగిన లాభాలు దక్కుతాయి. కుటుంబ సభ్యులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి. పిత్రు వర్గీయుల నుండి ధన సహాయం అందుతుంది. భూ క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

మిధునం: దూర ప్రాంతాల బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. ఇంటాబయట ఏర్పడిన చికాకులు కొంతవరకు తొలగుతాయి. సంతానానికి నూతన విద్యా, ఉద్యోగవకాశాలు లభిస్తాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వాహనాల ప్రయాణాలలో తొందరపాటు పనిచేయదు.

కర్కాటకం: ఉద్యోగాలలో అధికారులతో చర్చలు ఫలిస్తాయి. నూతన పనులకు శ్రీకారం చుట్టి సకాలంలో పూర్తి చేస్తారు. సోదరుల నుంచి ధన, వస్తు లాభాలు పొందుతారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి బాటలో సాగుతాయి.

సింహం: కుటుంబ సభ్యుల ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. కుటుంబ నభ్యులతో ఏర్పడిన విభేదాలను పరిష్కరించుకొంటారు. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. గృహనిర్మాణ ఆలోచనలు మందకోడిగా సాగుతాయి. దూరప్రాంతాల నుంచి అందిన ఒక వార్త ఆనందం కలిగిస్తుంది.

కన్య: విద్యార్థులకు నూతన విద్యావకాశాలు లభిస్తాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. బంధు మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు చెయ్యడం శ్రేయస్కరం.

తుల: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుంచి బయటపడతారు. బందు మిత్రులతో ఏర్పడిన వివాదాలను పరిష్కరించుకుంటారు. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. చేపట్టిన పనులు నిదానంగా పూర్తిచేస్తారు. భూ, క్రయ విక్రయాలలో స్వల్ప లాభాలు అందుతాయి.

వృశ్చికం: నూతన మిత్రులు పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. సోదరులతో భూవివాదాలు తీరి ఒప్పందాలు కుదురుతాయి. మొండి బాకీలు వసూలవుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలు ప్రారంభించి లాభాలు అందుకుంటారు.

ధనస్సు: ఉద్యోగాలలో అధికారులతో ఉన్న వివాదాలు సమసిపోతాయి. నిరుద్యోగులు ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో దైర్యంగా ముందుకు సాగుతారు. బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి.

మకరం: నిరుద్యోగుల ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహపరుస్తాయి. జీవిత భాగస్వామి సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. చేపట్టిన పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో ఎదురైన సమస్యలు రాజి అవుతాయి.

కుంభం: వ్యాపారాలలో విశేషమైన లాభాలు అందుకుంటారు. ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా సన్నిహితుల సహాయంతో పూర్తి చేస్తారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో కీలక సమాచారం అందుకొంటారు.

మీనం: కుటుంబ సభ్యులతో విందు, వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆకస్మిక ధనలాభాలు పొందుతారు. ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. చేపట్టిన పనులలో యత్నకార్య సిద్ధి కలుగుతుంది. వివాదాలకు సంబంధించి దూర ప్రాంత బంధువుల నుంచి కీలక సమాచారం అందుతుంది.

# ఇంక్రిమెంట్లు లేవు





**మొదటి పేజీ తరువాయి**

పాలకవర్గానికి లోపించింది. ఒక ఫైర్ ఫైటర్‌కు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కావాలంటే.. ముందుగా నెలల తరబడి తన డ్యూటీకి సెలవు పెట్టాలి. ఆ తర్వాత ఎక్కడో చోట భారీ వాహనాన్ని వెతుక్కుని, డ్రైవింగ్ నేర్చుకుని, ఆర్టీఏ అధికారుల చుట్టూ తిరిగి లైసెన్స్ తెచ్చుకోవాలి. ఇంక్రిమెంట్ కోసం ఉద్యోగులంతా ఇలా సెలవులు పెట్టి డ్రైవింగ్ స్కూళ్లకు వెళితే, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజల ప్రాణాలు కాపాడేదెవరు? అసలే సిబ్బంది కొరతతో అగ్నిమాపక శాఖ అల్లాడుతుంటే, ఉన్న సిబ్బందిని ఇలా డ్రైవింగ్ నేర్చుకోమని రోడ్లమీదకు పంపడం ప్రభుత్వ అనాలోచిత చర్యలకు పరాకాష్ట.

### హక్కులను కాలరాస్తున్న సర్కారు

ఉద్యోగికి ఏటా వచ్చే వార్షిక ఇంక్రిమెంట్ అనేది అతడి ప్రాథమిక హక్కు. కానీ, ఆ హక్కును కాలరాస్తూ, అర్థరహితమైన జీవో 86ను అడ్డుపెట్టుకుని రెగ్యులర్ ఇంక్రిమెంట్లను సైతం నిలిపివేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి అద్దం పడుతోంది. ఆర్థిక భారం తగ్గించుకునే నెపంతో సిబ్బందితో వెట్టిచాకిరీ చేయించుకోవాలనే కుట్ర ఇందులో దాగి ఉందన్న విమర్శలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి. నియామక సమయంలో లేని నిబంధనలు కొత్తగా అమలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదరాబాదరాగా జీవోలు ఇచ్చి, లేని కండీషన్లు పెట్టి తమ జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని వాపోతున్నారు. ఎన్ని విన్నపాలు, విజ్ఞప్తులు చేసుకుంటున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### చిచ్చు రేపిన జీవో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 1992లో ఇచ్చిన జీవో నంబరు 568 ప్రకారమే నియామకాలు, పదోన్నతులు కొనసాగుతూ వస్తున్నాయి. ఫైర్‌మెన్లకు లీడింగ్ ఫైర్‌మెన్లుగా, డ్రైవర్ ఆపరేటర్లకు ఎన్ఎఫ్‌వోగా ప్రమోషన్ వచ్చేది. తెలంగాణ వచ్చాక అగ్నిమాపకశాఖలో పదోన్నతులకు ప్రత్యేకంగా మ్యానువల్ తీసుకురాకపోవడంతో పాత పద్ధతిలోనే పదోన్నతులు కొనసాగాయి. అయితే, కొత్త నిబంధనలు రూపొందించకపోవడంపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి వరకు నియామకాలు, పదోన్నతులు నిలిపివేయాలని కోర్టును కోరారు. దీంతో తెలంగాణ ఫైర్ సర్వీసెస్ సబార్డినేట్ సర్వీస్ నిబంధనల డ్రాఫ్ట్ ను సిద్ధం చేయాలని హైకోర్టు ఆదేశించింది. పలు వాయిదాల తర్వాత కూడా నిబంధనల డ్రాఫ్ట్ పై నాలుగు వారాల గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది కోర్టును కోరటంతో.. గత ఏడాది జూలై 17లోగా డ్రాఫ్ట్ సమర్పించాలని, లేకపోతే సీఎస్ వ్యక్తిగతం కోర్టుకు హాజరు కావాలని స్పష్టం చేసింది. దాంతో అదే సంవత్సరం జూలై 11న కొత్త నిబంధనలతో హోంశాఖ జీవో నంబరు 86ను విడుదల చేసింది. పోస్టుల పేర్లు మారుస్తూ ఆ జీవో విడుదల చేసింది. లీడింగ్ ఫైర్‌మెన్‌ను లీడింగ్ ఫైర్ ఫైటర్‌గా, డ్రైవర్ ఆపరేటర్ పోస్టును ఫైర్ ఫైటర్ (టెక్నికల్)గా, ఫైర్‌మెన్ పోస్టును ఫైర్ ఫైటర్‌గా మార్పు చేసింది. అంతేకాదు, ఆ జీవో ప్రకారం.. ఫైర్‌మెన్లు నేరుగా ఎల్ఎఫ్ కాలేరు. ఎల్ఎఫ్ కావాలంటే డ్రైవర్ ఆపరేటర్‌గా పనిచేయాలి. ఆ తర్వాతే ఎల్ఎఫ్‌గా ప్రమోషన్ లభిస్తుంది. డ్రైవర్ ఆపరేటర్ కావాలంటే హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాల్సిందే. 1992 రూల్స్ ప్రకారం.. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ అవసరం లేదు. 2024 వరకు తెలంగాణ అగ్నిమాపక శాఖలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉన్న నిబంధనల ప్రకారమే రిక్రూట్మెంట్ జరిగింది. 1992లో ఇచ్చిన జీవో నంబరు 568 ప్రకారమే పోస్టుల భర్తీ జరుగుతుందని కూడా నోటిఫికేషన్లో పేర్కొన్నారు. గత ఏడాది జూన్ వరకు కూడా ఆ జీవో ప్రకారమే పదోన్నతులు కొనసాగాయి. జీవో నంబరు 568లో.. ఫైర్‌మెన్లకు లీడింగ్ ఫైర్‌మెన్ (ఎల్ఎఫ్)గా పదోన్నతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పదోన్నతి పొందాలంటే హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందాలన్న నిబంధనేదీ లేదు. ఇప్పటి వరకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే ప్రమోషన్లు లభించాయి కూడా. కానీ, ఇప్పుడు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ అడుగుతుండటంతో ఫైర్‌మెన్లు దిక్కులు చూడాల్సిన పరిస్థితి తలెత్తింది. 86 జీవో తెచ్చి, పదోన్నతి కావాలంటే కచ్చితంగా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాల్సిందేనని నిబంధన విధించడంతో ఫైర్‌మెన్లకు ఏం చేయాలో అర్థం కావడం లేదు.

### సోయి లేని ఉన్నతాధికారులు..?

హెవీ డ్రైవింగ్‌లో ఎలాంటి అనుభవం లేని ఫైర్‌మెన్లు డ్రైవర్ ఆపరేటర్‌గా ప్రమోషన్ తీసుకోవడం కాని పని. అదీకాకుండా, వార్షిక వేతనం పెంపు ఉండాలన్నా ఫైర్‌మెన్‌కు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాల్సిందే. ఆ లెక్కన, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే.. జీవితాంతం అదే పోస్టులో, అదే జీతంతో పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ జీవోను అడ్డం పెట్టుకొని హెవీ లైసెన్స్ లేదని.. ఫైర్ ఫైటర్లకు ఈ ఏడాది జూన్‌లో రావాల్సిన వార్షిక వేతన పెంపును సర్కారు నిలిపివేసింది. అయితే, ఉన్నతాధికారుల సోయి ఏపాటిదో తెలుసా..? కొన్ని జిల్లాల్లో ఉద్యోగులకు హెవీ లైసెన్స్ లేకున్నా, వేతన పెంపు చేయడం. మిగతా జిల్లాల్లో మాత్రం ఇంక్రిమెంట్ నిలిపివేయడం.




# కబడ్డీ విజేతలుగా నల్లగొండ, కొత్తగూడెం

**మొదటి పేజీ తరువాయి**

క్రీడాకారులు చివరి వరకు పోరాడి టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. బాలికల విభాగం ఫైనల్లో భద్రాద్రి కొత్తగూడెం జట్టు ఖమ్మం జట్టుపై విజయం సాధించింది. పాయింట్ పాయింట్‌కూ ఉత్కంఠగా సాగిన పోరులో కొత్తగూడెం క్రీడాకారిణులు సమన్వయంతో ఆడి విజేతలుగా నిలిచారు. ఫైనల్ మ్యాచ్‌లను వీక్షించిన మంత్రి పొన్నం ప్రభాకర్ విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి క్రీడాకారులను అభినందించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి సరదాగా కబడ్డీ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. వేములవాడలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆది శ్రీనివాస్ నాయకత్వంలో నిర్వహించిన ఈ పోటీల్లో 33 జిల్లాల నుంచి బాలుర, బాలికల జట్లు పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటాయని తెలిపారు. ఫైనల్లో విజయం సాధించిన నల్గొండ, కొత్తగూడెం జట్లకు అభినందనలు తెలిపారు. ఓటమి చెందిన క్రీడాకారులు నిరుత్సాహపడకుండా దాన్ని అనుభవంగా తీసుకుని మరింత పట్టుదలతో సాధన చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రాన్ని క్రీడల్లో అగ్రగామిగా నిలిపేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. భవిష్యత్ ఒలింపిక్స్‌లో భారత జట్టుకు తెలంగాణ నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించేలా వారికి అవసరమైన అవకాశాలు, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి నిర్ణయాలు తీసుకున్నామని, సీఎం కప్ ద్వారా గ్రామ స్థాయి నుంచి క్రీడా పోటీలు నిర్వహిస్తూ ప్రతిభను వెలికితీస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఉన్న క్రీడా మైదానాలను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు అవసరమైన చోట కొత్త మైదానాలు, క్రీడా సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. యువత సెల్‌ఫోన్‌లలో ఆటలకు పరిమితం కాకుండా మైదానాల్లో క్రీడలు ఆడాలని మంత్రి సూచించారు. మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్నప్పటి నుంచే క్రీడల వైపు ప్రోత్సహించాలని కోరారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలతో పాటు క్రీడాకారుల రాష్ట్రస్థాయి జట్టు ఎంపిక కూడా జరగడం అభినందనీయమన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, కోచ్‌లు, జట్టు నిర్వాహకులు, క్రీడాభిమానులను మంత్రి అభినందించారు. వేములవాడలో పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

### క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం: ఆది శ్రీనివాస్

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజన్న సన్నిధిలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. నాలుగు రోజుల పాటు వేములవాడలో పండుగ వాతావరణంలో పోటీలు జరిగాయని తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 1,300 మందికి పైగా క్రీడాకారులు, కోచ్‌లు, ఫిజియోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో వంటి క్రీడలకు మంచి ఆదరణ ఉందని, అక్కడి ప్రతిభను వెలికితీసి సరైన శిక్షణ, అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

సీఎం కప్ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలో సుమారు 42 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీశామని చెప్పారు. యువత మైదానాల్లో ఉండాలి, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆది శ్రీనివాస్ తెలిపారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన నల్గొండ, కొత్తగూడెం జట్లకు ఆయన అభినందనలు తెలిపారు. గెలుపు, ఓటములు సహజమని, ఓడిపోయిన క్రీడాకారులు నిరుత్సాహపడకుండా మరింత కష్టపడి సాధన చేసి భవిష్యత్ పోటీల్లో విజేతలుగా నిలవాలని సూచించారు. వేములవాడ మున్సిపల్ పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, రాజన్న సిరిసిల్ల జిల్లా కబడ్డీ సంఘం ప్రతినిధులు, కోచ్‌లు, ఫిజియోలు, నిర్వాహకులు, క్రీడాభిమానులు, పోలీసు, వైద్య, ఇతర శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయడం వల్లే పోటీలు విజయవంతమయ్యాయని ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న సన్నిధిలో జరిగిన ఈ పోటీలు క్రీడాకారులకు చిరస్థాయిగా గుర్తుండిపోతాయని పేర్కొన్నారు.

# రీచార్జ్ ధరల మోత!

**మొదటి పేజీ తరువాయి**

మరింత ప్రియం కానున్నాయి. ఇప్పటికే పెరిగిన ఖర్చులతో సతమతమవుతున్న సామాన్యులు, డిజిటల్ వినియోగదారులపై ఈ తాజా టారిఫ్ బాదుడు అదనపు ఆర్థిక భారంగా మారనుంది. ఇప్పటికే, జూన్ తర్వాత జియో కొత్తగా 80 లక్షల మంది సబ్‌స్క్రైబర్లను చేర్చుకొని తన యూజర్ బేస్‌ను 54.1 కోట్లకు పెంచుకోగా, ఆర్పు నెలకు రూ. 218కి చేరింది. అలాగే భారతీ ఎయిర్‌టెల్ 30 లక్షల కొత్త సబ్‌స్క్రైబర్లతో మొత్తం 38 కోట్లకు చేరడంతో పాటు, పరిశ్రమలోనే అత్యధికంగా రూ. 269 ఆర్పుని నమోదు చేసింది.

# జీతాలు రావు..!

**మొదటి పేజీ తరువాయి**

ఇప్పించడం లేదో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. పైగా, 2022లో వేసిన టెండర్ కాలపరిమితి పూర్తయి ఏడాది దాటుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు.

### వెంటనే వేతనాలు ఇవ్వకుంటే పోరాటమే

కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుని కడుపుమాడిస్తే చూస్తూ ఊరుకోబోమని, తక్షణమే పెండింగ్ వేతనాలు అమలుపరచాలని ఎస్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కుర్రి సైదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఎంఈ నివేదికల ఆధారంగా జిల్లా అధికారులపై ఒత్తిడి తెచ్చి కార్మికులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ఎస్పీఎస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోరాటం తీవ్రస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేశ్, కోశాధికారి పత్తిపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మాతంగి అనిల్ కుమార్, నల్లగొండ జిల్లా నాయకులు పురం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ఫారం-7పై చర్యలు

**మొదటి పేజీ తరువాయి**

నేపథ్యంలో సీఈవో సుదర్శన్ రెడ్డి ఈ ఆదేశాలు జారీ చేశారు. ఫామ్–7లో తప్పుడు సమాచారం సమర్పిస్తున్న వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టం–1950లోని సెక్షన్ 31 ప్రకారం చర్యలు తీసుకోవాలని ఈఆర్‌ఓలకు ఆయన సూచించారు. చర్యలకు ముందు విచారణ నిర్వహించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్–1960లోని రూల్ 20 ప్రకారం విచారణ సాగాలని చెప్పారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ డీఈఓతో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లకు, డీఈఓలకు ఉత్తర్వులు జారీ చేశారు.

# ఫారం-6 సవరణలకు ఆమోదం లేదు

**మొదటి పేజీ తరువాయి**

ఓటర్లు తమ తల్లిదండ్రులు లేదా తాత, నానమ్మలు లేదా తాత, అమ్మమ్మల గత ఓటర్ల జాబితాలతో అనుసంధానించే వివరాలను అందించాలని కోరడం వివాదస్పదమైంది. అయితే తమకు తెలియకుండా లేదా తమ సిఫార్సు లేకుండా ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ (సర్), 'ఫారం 6' సవరణకు సంబంధించి సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని, ఉత్తర్వులు జారీ చేశారంటూ ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఆరోపించినట్లు సెప్టెంబర్ 25న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక వార్తా కథనాన్ని ప్రచురించింది. ఆ ఇద్దరు ఎన్నికల కమిషర్లు గత 10 నెలల్లో కనీసం 14 సార్లు రికార్డుల్లో తమ అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో 'సర్' ప్రక్రియపై వివాదం తారాస్థాయికి చేరింది. కాగా, సెప్టెంబర్ 28న ఈ వివాదంపై ఈసీ స్పందించింది. 'ఫారం 6' సవరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపినట్లు పేర్కొంది. అలాగే జతచేయాల్సిన డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించినట్లు ఈసీ వెల్లడించింది. అయితే 'ఫారం 6'లో ఎలాంటి సవరణలకు తాము ఆమోదం తెలుపలేదని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. ఈ మార్పులు ఎవరు చేశారో నిర్ధారించేందుకు సంబంధిత రికార్డులను తాము పరిశీలిస్తామని సీజేఐ సూర్య కాంత్ పేర్కొన్నారు.

# విద్యుత్తు చార్జీల షాక్!

**మొదటి పేజీ తరువాయి**

విద్యుత్ సంస్థలు వెల్లడించాయి. నియోగదారులపై ఒకేసారి అత్యధిక భారం పడకుండా ఉండటానికి డిస్కంల వారీగా ప్రత్యేక కాలపరిమితిని కేటాయించారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో 29 నెలల పాటు, ఎన్పీడీసీఎల్ పరిధిలో 26 నెలల పాటు ఈ చార్జీలను వసూలు చేసుకునేందుకు ఈఆర్సీ అనుమతి ఇచ్చింది. నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న వేళ సామాన్యులకు, మధ్యతరగతి ప్రజలకు ఈ అదనపు విద్యుత్ చార్జీలు ఆర్థికంగా మరింత భారం కానున్నాయి.



# పత్తి రైతుల కోసం డిజిటల్ సంస్కరణలు

## హైదరాబాద్‌లో 'సంస్కరణల ఉత్సవం'లో సీసీఐ ప్రత్యేక ప్రదర్శన




హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): పత్తి రైతులకు సాధికారత కల్పించడం, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకతను పెంచడం, దేశీయ పత్తి విలువ శ్రేణిని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ రంగ సంస్థ భారత పత్తి సంస్థ (సీసీఐ) పలు సంస్కరణలు చేపట్టింది. ఈ సంస్కరణలను ప్రజలకు, రైతులకు, పరిశ్రమ వర్గాలకు పరిచయం చేసేందుకు 'సంస్కరణల ఉత్సవం-2026'లో భాగంగా అక్టోబర్ 6(మంగళవారం)న హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు, విధాన నిర్ణేతలు, రైతులు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు, పత్తి-జౌళి రంగాలకు చెందిన ఇతర భాగస్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. క్షేత్రస్థాయిలో సంస్కరణలతో వచ్చిన మార్పులను వివరించడంతో పాటు పత్తి విలువ శ్రేణిలోని వివిధ భాగస్వాములు తమ అనుభవాలను పరస్పరం పంచుకునేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలవనుంది. గత కొన్నేళ్లుగా సీసీఐ పత్తి సేకరణ, రైతుల నమోదు, డిజిటల్ స్లాట్ బుకింగ్, నేరుగా రైతుల ఖాతాల్లో చెల్లింపులు, నాణ్యత నిర్ధారణ, ఉత్పత్తుల సమాచార పర్యవేక్షణ, పత్తి విక్రయాలు, వివిధ భాగస్వాముల అనుసంధానం వంటి అంశాల్లో సాంకేతిక, సంస్థాగత సంస్కరణలను అమలు చేస్తోంది. వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం, పారదర్శకత-జవాబుదారీతనాన్ని పెంచడం, రైతులకు సమర్థవంతమైన సేవలు అందించడం ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశాలు.

**కపాస్ కిసాన్ డిజిటల్ వేదిక**

కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా సీసీఐ చేపట్టిన కీలక సంస్కరణలు, కార్యక్రమాలపై ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. వీటి అమలు, ప్రభావాన్ని వివరించే లఘుచిత్రాన్ని కూడా ప్రదర్శిస్తారు. డిజిటల్ సాంకేతికత, ప్రక్రియల పునర్వ్యవస్థీకరణతో సంప్రదాయ పత్తి సేకరణ విధానాల్లో వచ్చిన మార్పులు, రైతులు, సీసీఐ, జిన్నింగ్ మిల్లులు, వస్త్ర పరిశ్రమ మధ్య మెరుగైన సమన్వయం వంటి అంశాలను ప్రదర్శనలో వివరించనున్నారు. ప్రధానంగా 'కపాస్ కిసాన్' డిజిటల్ వేదికను ప్రదర్శించనున్నారు. రైతుల నమోదు, పత్తి విక్రయానికి సమయ కేటాయింపు, సేకరణకు సంబంధించిన సమాచార మార్పిడి, ఆధార్ ఆధారిత చెల్లింపులు తదితర ప్రక్రియలను ఈ వేదిక ఒకే డిజిటల్ వ్యవస్థలోకి తీసుకొచ్చింది. తద్వారా పత్తి సేకరణలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రక్రియలోని సంక్లిష్టతలను తగ్గించి, రైతులకు మరింత స్పష్టమైన సమాచారం అందించేందుకు అవకాశం ఏర్పడింది.

**నాణ్యత, గుర్తింపు, కస్తూరి కాటన్**

భారతీయ పత్తి నాణ్యతను మెరుగుపరచడం, పత్తి ఉత్పత్తి నుంచి సేకరణ వరకు దాని వివరాలను గుర్తించే సామర్థ్యాన్ని పెంచడం కోసం సీసీఐ చేపడుతున్న చర్యలను కూడా ప్రదర్శించనున్నారు. పత్తిలో కలుషితాలను నియంత్రించడం, డిజిటల్ వివరాల అనుసరణ వ్యవస్థను బలోపేతం చేయడం, 'కస్తూరి కాటన్ భారత్' కార్యక్రమం ద్వారా అత్యుత్తమ నాణ్యత కలిగిన పత్తిని ప్రోత్సహించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ చర్యల ద్వారా భారతీయ పత్తికి ప్రత్యేక గుర్తింపు కల్పించడం, నాణ్యతను పెంచడం, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీతత్వాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

**అధిక సాంద్రత మొక్కల పెంపకంపై దృష్టి**

అధిక సాంద్రత మొక్కల పెంపకం విధానం (హెచ్‌డీపీఎస్)తో పాటు సంబంధిత వ్యవసాయ సంస్థల సహకారంతో చేపడుతున్న ఉత్పాదకత పెంపు కార్యక్రమాలపైనా ప్రదర్శనలో ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. భారతీయ పత్తి ఉత్పాదకతలో ఉన్న అంతరాన్ని తగ్గించడం, రైతుల స్థాయిలో ఆదాయాన్ని పెంచడం, మొత్తంగా భారతీయ పత్తి రంగం పోటీతత్వాన్ని బలోపేతం చేయడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యాలుగా సీసీఐ పేర్కొంది. కార్యక్రమంలో పత్తి రైతులు, పరిశ్రమల ప్రతినిధులు తమ అనుభవాలను పంచుకోనున్నారు. పత్తి నాణ్యత మెరుగుదల, హెచ్‌డీపీఎస్, కస్తూరి కాటన్ భారత్, పత్తి సేకరణలో డిజిటలీకరణ, పత్తి విలువ శ్రేణిని బలోపేతం చేసేందుకు చేపడుతున్న ఇతర చర్యలపై చర్చలు జరగనున్నాయి.



## సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

**పరామర్శించిన బొడిగ శోభ**

గంగాధర, అక్టోబర్ 5 (ఈవా ర్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండాయపల్లి సర్పంచ్ మల్యాల వినయ్ సాగర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మధురా నగర్ చౌరస్తాలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బోడిగ శోభ ఆస్పత్రికి వెళ్లి వినయ్ సాగర్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బోడిగ శోభ వెంట చొప్పదండి బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## కరెన్సీ నోట్లపై అంబేద్కర్ చిత్రం ముద్రించాలి

**కేంద్రానికి జింక శ్రీధర్ విజ్ఞప్తి**

వేములవాడ అర్బన్, అక్టోబర్ 5 (ఈవార్తలు): భారతీయ కరెన్సీ నోట్లపై భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రాన్ని ముద్రించాలని బహుజన సేన రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాతగానే కాకుండా గొప్ప ఆర్థికవేత్తగా దేశానికి సేవలందించారని తెలిపారు. భారత కరెన్సీ, ద్రవ్య వ్యవస్థపై ఆయన లోతైన అధ్యయనం చేశారని, దీనికి నిదర్శనంగా 'ది ప్రాబ్లమ్ ఆఫ్ ది రూపీ-ఇట్స్ ఆరిజిన్ అండ్ ఇట్స్ సొల్యూషన్' గ్రంథాన్ని రచించారని పేర్కొన్నారు. భారత కరెన్సీ, ద్రవ్య వ్యవస్థపై అంబేద్కర్ ఆలోచనలు హిల్టన్ యంగ్ కమిషన్‌గా ప్రసిద్ధి చెందిన రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్ ముందు ఆయన సమర్పించిన అభిప్రాయాల ద్వారా చర్చకు వచ్చాయని తెలిపారు. అనంతరం భారతదేశానికి కేంద్ర బ్యాంకు అవసరాన్ని ఆ కమిషన్ సిఫారసు చేసిందని, తదుపరి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934లో ఆమోదం పొందగా, 1935 ఏప్రిల్ 1న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యకలాపాలు ప్రారంభించిందని వివరించారు. భారత ద్రవ్య వ్యవస్థపై అంబేద్కర్ చేసిన ఆర్థిక అధ్యయనం, ఆయన ఆర్థిక ఆలోచనలు దేశ చరిత్రలో కీలకమైనవని శ్రీధర్ అన్నారు. ఆర్థిక, సామాజిక సమానత్వం, రాజ్యాంగ విలువల కోసం కృషి చేసిన అంబేద్కర్‌కు కరెన్సీ నోట్లపై తగిన గుర్తింపు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించి అంబేద్కర్ చిత్రాన్ని కరెన్సీ నోట్లపై ముద్రించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## నేడు వేములవాడకు కవిత

వేములవాడ అర్బన్, అక్టోబర్ 5 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మంగళవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో ఆమె పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు సుమలత శర్మ పిలుపునిచ్చారు. సోమవారం వేములవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కవితకు వేములవాడ నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలకాలని కోరారు. పార్టీ ఆవిర్భవించిన కొద్దికాలంలోనే ప్రజల నుంచి, ముఖ్యంగా యువత నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా సుమలత శర్మ విమర్శలు చేశారు. గత ప్రభుత్వ హయాంలోనూ ప్రజా సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఇటీవల సిరిసిల్ల పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వకుండా కేసీఆర్, కేటీఆర్‌లను విమర్శించడానికే ఎక్కువ సమయం కేటాయించారని అన్నారు. వేములవాడ నియోజకవర్గంలో చేనేత కార్మికుల సమస్యలు, నేరెళ్ల బాధితుల సమస్యలు, మౌలిక వసతుల కొరత వంటి అంశాలు ఇంకా పరిష్కారం కాలేదని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం తెలంగాణ రాష్ట్ర సేన పోరాడుతుందని సుమలత శర్మ స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు సంకెపల్లి సుధాకర్ శర్మ, నూనె మల్లేశం యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టేకు దుంగల దొంగతనం కేసులో నలుగురు అరెస్ట్



ధర్మపురి, అక్టోబర్ 5 (ఈవార్తలు): టేకు చెట్లను అక్రమంగా నరికి దొంగతనానికి పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి 132 టేకు దుంగలు, ఆటో, బైక్, విద్యుత్ రంపాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ధర్మపురి సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి తెలిపారు. ఎండపల్లి మండలం పాతగూడూరుకు చెందిన పోనుగంటి రామారావు తన పొలంలోని రెండు టేకు చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికి దొంగిలించారని ఫిర్యాదు చేయడంతో వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలు, జగిత్యాల డీఎస్పీ పురుషోత్తంరెడ్డి సూచనల మేరకు సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. దర్యాప్తులో భాగంగా వెల్గటూర్ శివారులో టేకు చెట్లను నరికి తరలిస్తున్న అవైజ్, ఖాజీ రహమాన్ అలీ, అర్సద్, షౌకత్ అలీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాత్రివేళల్లో జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో టేకు చెట్లను గుర్తించి విద్యుత్ రంపంతో నరికి ఆటోలో తరలించేవారని విచారణలో వెల్లడైనట్లు సీఐ తెలిపారు. మేడిపల్లి, జగిత్యాల రూరల్, మల్యాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో కూడా టేకు చెట్ల దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. నిందితులను అరెస్టు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

## దసరా, బతుకమ్మకు భీమన్న గుడి ముస్తాబు




వేములవాడ అర్బన్, అక్టోబర్ 5 (ఈవార్తలు): సద్దుల బతుకమ్మ, విజయదశమి పర్వదినాల సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరస్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబవుతోంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాల నేపథ్యంలో ఆలయానికి రంగురంగుల విద్యుద్దీపాలు, విద్యుత్ అలంకరణలు, హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ప్రత్యేక పూజల కోసం ఆలయ మండపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళా భక్తులు బతుకమ్మ ఆడేందుకు, కోలాటం, దాండియా నిర్వహించేందుకు భీమేశ్వర సదన్ వద్ద ఉన్న విశాలమైన ప్రదేశాన్ని సిద్ధం చేస్తున్నారు. బతుకమ్మ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆలయ ఈవో రమాదేవి ఆదేశాల మేరకు ఈఈ రాజేష్ ఆలయంలో జరుగుతున్న ముస్తాబు, అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను, సిబ్బందిని సూచించారు.

## జర్నలిస్టుల కాలనీకి మౌలిక వసతులు: ఆది



వేములవాడ అర్బన్, అక్టోబర్ 5 (ఈవార్తలు): వేములవాడలో నూతనంగా ఏర్పడుతున్న జర్నలిస్టుల కాలనీకి అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నాంపల్లి పరిధిలోని జర్నలిస్టుల కాలనీని ఆయన సందర్శించి విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు భూమిపూజ చేశా రు. సుమారు 60 మంది జర్నలిస్టులకు పట్టాలు మంజూరు కావడంతో ఇళ్ల నిర్మాణానికి ముందుకు వస్తున్న నేపథ్యంలో కాలనీలో తాగు నీరు, విద్యుత్, వీధి దీపాలు తదితర సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు. నీటి సమస్య పరిష్కారానికి మూడు బోర్‌బావులు ఏర్పాటు చేసి మోటార్లు బిగించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పా రు. కాలనీలో అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వైర్లు, వీధి దీపాలు బిగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు కిలోమీటర్ పరిధిలో విద్యుత్ స్తంభాలు, వైర్లు ఉచితంగా ఏర్పాటు చేసే విధానం అమల్లో ఉందన్నారు. రైతులకు కూడా నిర్దిష్ట నిబంధనల మేరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో ఇప్పటికే సుమారు 2,800 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జర్నలిస్టుల కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లకు కూడా విద్యుత్ సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బోర్‌బావులకు త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్లు, వీధి దీపాలకు అవసరమైన విద్యుత్ సదుపాయాలను త్వరితగతిన కల్పించాలని అధికారులను ఆదేశిం చారు. కాలనీలో పచ్చదనం పెంపొం దించేం దుకు వనమహోత్సవం నిర్వహించాలని ఆది శ్రీనివాస్ సూచించారు. ప్రకృతి రమణీయ వాతా వరణంలో ఉన్న ఈ ప్రాంతంలో పెద్దఎత్తున మొక్కలు నాటితే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. కాలనీలో సుమారు 60 మంది జర్నలిస్టులు ఉన్నందున సమస్యల పరిష్కారం కోసం ఒక సంఘంగా ఏర్పడాలని సూచించారు. కాలనీ అభివృద్ధికి సంబంధించి ఎదురయ్యే సమస్యలను అధికారులు, ప్రజాప్ర తినిధుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు దాసరి దేవేందర్, ప్రధాన కార్యదర్శి ఎన్.టి. బాబు యాదవ్, వేములవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాపల్లి శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మండి.. కుళ్లిన తిండి!



**కుళ్లిన ఆహార పదార్థాలు, అపరిశుభ్రత గుర్తింపు**
**రెస్టారెంట్లలో మున్సిపల్ అధికారుల తనిఖీలు**
**మూడు రెస్టారెంట్లకు రూ.20 వేల జరిమానా**

జగిత్యాల, అక్టోబర్ 5 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని పలు రెస్టారెంట్లలో మున్సిపల్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కుళ్లిపోయిన ఆహార పదార్థాలు, అపరిశుభ్రతను గుర్తించిన అధికారులు నిబంధనలు పాటించని మూడు రెస్టారెంట్లకు మొత్తం రూ.20 వేల జరిమానా విధించారు. మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్ ఆదేశాల మేరకు పారిశుధ్య తనిఖీ అధికారి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పీఎంఆర్, మండి, కింగ్స్ మండి రెస్టారెంట్లలో తనిఖీలు చేపట్టారు. ఆహార పదార్థాల నిల్వ, వంటశాల, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రెస్టారెంట్ల నిర్వాహకులు తప్పనిసరిగా పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని కమిషనర్ సూచించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీలు!

హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో పాటు మరో నాలుగు అంతర్జాతీయ యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపినట్లు అధికారులు సీఎస్‌కు తెలిపారు. విదేశీ వర్సిటీలను ఆహ్వానించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పెట్టుబడులకు అవకాశం కల్పించడం, అనుమతులు సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను పాలసీలో చేర్చాలని సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తెకు ఎమ్మెల్సీ?

హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): తెలంగాణలో త్వరలో ఖాళీ కానున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. తెలంగాణ ఉద్యమ పితామహుల్లో ఒకరైన కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తె పవిత్రవాణి పేరును ఓ స్థానానికి పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ఆమె, ప్రస్తుతం వైద్యవృత్తిలో ఉన్నారు. సిరిసిల్ల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఒక ఎమ్మెల్సీ సీటును పద్మశాలి వర్గానికి కేటాయిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవికి రాజీనామా చేసిన తొలి నేతగా కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్రలో నిలిచారు. అయితే, రాష్ట్రం ఏర్పడ్డాక ఉద్యమకారుల కుటుంబాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటి నుంచీ ఆరోపిస్తున్నారు. సీఎం అయ్యాక ఆ దిశగా చర్యలు చేపట్టారు. ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఎమ్మెల్సీగా, శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనుమరాలిని మహిళా కమిషన్ సభ్యులుగా నియమించారు.

## 4 లక్షల లంచం.. అవినీతి అధికారిణి

హైదరాబాద్, అక్టోబర్ 5 (ఈవార్తలు): హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు కొనసాగుతున్నాయి. మెహదీపట్నంలోని జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో రూ.4 లక్షల లంచం తీసుకున్న టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సునీతను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భవన నిర్మాణ అనుమతులు, క్లియరెన్స్‌కు సంబంధించిన వ్యవహారంలో ఓ వ్యక్తి నుంచి ఆమె లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. లంచం డిమాండ్‌పై బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా.. అధికారులు పక్కా ప్రణాళికతో సోమవారం మెహదీపట్నం జీహెచ్ఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. బాధితుడి నుంచి సునీత రూ.4 లక్షలు స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు, కేసుకు సంబంధించిన వివరాలను నమోదు చేశారు.







# ట్రెసాకు దిశ.. ఉద్యోగులకు... భరోసా

..సేవా ప్రస్థానానికి చిరునామా

సేవలో నిబద్ధత ఆయన లక్షణం..
సంఘ నాయకత్వం ఆయన బలం..
సమస్యల్లో సంఘీభావం ఆయన నైజం ..
సహచరులకు భరోసా ఆయన సిద్ధాంతం..

దాదాపు నాలుగు
దశాబ్దాల ఉద్యోగ జీవితం..
వివిధ స్థాయుల్లో ట్రెసా బాధ్యతలు..
రాష్ట్ర అధ్యక్షుడిగా వరుసగా 3 సార్లు ఎన్నిక..
..ఇదీ వంగ రవీందర్ రెడ్డి ట్రాక్ రికార్డు
ఆయన ఉద్యోగులు మెచ్చిన నాయకుడు..!



సిద్దిపేట జిల్లాకు చెందిన వంగ రవీందర్‌రెడ్డి 1987లో గ్రూప్-4 ద్వారా ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. ఉద్యోగ జీవితంలో క్రమంగా ఎదుగుతూ క్షేత్రస్థాయి పరిస్థితులను దగ్గరగా అర్థం చేసుకున్నారు. రెవెన్యూ శాఖలో కింది స్థాయి ఉద్యోగి నుంచి తహసీల్దార్ స్థాయి వరకు పనిచేయడంతో గ్రామీణ ప్రాంతాల్లోని భూమి, రెవెన్యూ, ఉద్యోగ సంబంధిత సమస్యలపై ప్రత్యక్ష అవగాహన ఏర్పడింది. ఉద్యోగ జీవితంలో సంపాదించిన అనుభవమే ఆయన తర్వాతి ట్రెసా నాయకత్వానికి బలంగా మారింది. ఉద్యోగుల సమస్యలను కేవలం కార్యాలయ దృష్టితో కాకుండా, వాటి వెనుక ఉన్న కుటుంబ, ఆర్థిక, భవిష్యత్ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకునే విధానం ఆయనకు ఏర్పడింది. కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రయాణం డివిజన్ అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహాయ అధ్యక్షుడు స్థాయిలను దాటి రాష్ట్ర అధ్యక్షుడి వరకు సాగింది. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడిగా వరుసగా మూడుసార్లు బాధ్యతలు చేపట్టి దాదాపు తొమ్మిదేళ్లపాటు రాష్ట్రస్థాయి సంఘ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారు. ఉద్యోగుల భద్రత, పదోన్నతులు, పని పరిస్థితులు, ఉద్యోగుల ఆత్మగౌరవం వంటి అంశాలను సంఘం తరఫున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ శాఖలో గ్రామ రెవెన్యూ సహాయకుడి నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకు వివిధ స్థాయిల్లో పనిచేసే ఉద్యోగుల సమస్యలను ఒకే వేదికపై చర్చించే ప్రయత్నం చేశారు.

## ఉద్యోగులకు.. నేనున్నానని!

ఉద్యోగుల సమస్యలను విని వెంటనే స్పందించడం రవీందర్‌రెడ్డి నాయకత్వంలో ప్రత్యేకంగా కనిపించే అంశంగా సహచరులు గుర్తుచేసుకుంటారు. అన్యాయం జరిగిందని భావించినా, పదోన్నతి విషయంలో సమస్య ఎదురైనా, ఉద్యోగ భవిష్యత్తుపై అనిశ్చితి ఏర్పడినా ఉద్యోగులు ఆయనను సంప్రదించేవారు. "నేనున్నాను" అనే భరోసా చెప్పడంతో ఆగిపోకుండా.. సమస్యకు కారణం ఏమిటి, పరిష్కారానికి ఏ మార్గం ఉంది, ఎవరితో చర్చించాలి అనే అంశాలపై ప్రయత్నాలు చేసేవారు. ఒక ఉద్యోగికి పదోన్నతి అంటే కేవలం హోదా పెరగడం కాదు. వేతనం, కుటుంబ ఆర్థిక పరిస్థితి, పిల్లల చదువులు, భవిష్యత్ భద్రత వంటి అనేక అంశాలతో ముడిపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో అర్హత ఉన్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే విషయంలో సంఘం తరఫున రవీందర్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు అనేకం. స్వరాష్ట్ర ఏర్పాటు అనంతరం భూ రికార్డుల నవీకరణ, భూ పరిపాలనలో మార్పులు రెవెన్యూ ఉద్యోగులకు పెద్ద సవాలుగా మారాయి. పాత రికార్డులు, వారసత్వ హక్కులు, కుటుంబ విభజనలు, స్వాధీనం, వివాదాలు వంటి అనేక అంశాలు క్షేత్రస్థాయిలో ఉద్యోగులకు సంక్లిష్ట పరిస్థితులను సృష్టించాయి. 2017-18లో చేపట్టిన భూ రికార్డుల నవీకరణ సమయంలో ఉద్యోగులపై పెరిగిన పని భారం, ప్రక్రియలో ఎదురైన సమస్యలు, ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలపై సంఘం తన వాదనను ప్రభుత్వం ముందుంచింది. భూ పరిపాలనలో సంస్కరణలు అవసరమే అయినా.. వాటి అమలులో ఉద్యోగులపై పడే భారం, క్షేత్రస్థాయి సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్న వైఖరిని రవీందర్ రెడ్డి నాయకత్వంలోని సంఘం వ్యక్తం చేసింది.

## కింది స్థాయి ఉద్యోగులకూ అండగా..

2020లో కొత్త భూ హక్కుల నమోదు చట్టం, ధరణి ఆధారిత భూ పరిపాలన అమల్లోకి రావడంతో రెవెన్యూ శాఖలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. గ్రామ రెవెన్యూ అధికారుల పోస్టుల రద్దు, వివిధ స్థాయిల్లో ఉద్యోగుల విధులు, బాధ్యతలు, భవిష్యత్తుపై అనిశ్చితి వంటి అంశాలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. ఒకవైపు ప్రభుత్వం తీసుకొచ్చిన పరిపాలనా సంస్కరణలు.. మరోవైపు ఉద్యోగుల భద్రత, భవిష్యత్ వంటి అంశాల మధ్య సమతుల్యత సాధించడం సంఘ నాయకత్వానికి సవాలుగా మారింది. ఈ సమయంలో ఉద్యోగుల ఆందోళనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో రవీందర్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. ప్రతి డిమాండ్ నెరవేరకపోయినా.. ఉద్యోగుల అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయడంలో సంఘం వెనుకడుగు వేయలేదన్నది ఆయన నాయకత్వంలోని మరో కోణం. గ్రామ రెవెన్యూ సహాయకులుగా దీర్ఘకాలం పనిచేసిన వీఆర్‌ఏల పరిస్థితి కూడా సంఘానికి ప్రధాన సమస్యగా నిలిచింది. తక్కువ వేతనాలు, విస్తృతమైన విధులు, ఉద్యోగ భద్రతపై అనిశ్చితి వంటి సమస్యలను వీఆర్‌ఏలు ఎదుర్కొన్నారు. 2023లో ప్రభుత్వం వీఆర్‌ఏల విద్యార్హతల ఆధారంగా వివిధ శాఖల్లో జూనియర్ సహాయకులు, రికార్డు సహాయకులు, చివరి శ్రేణి ఉద్యోగాలు తదితర పోస్టుల్లో సర్దుబాటు చేసే నిర్ణయం తీసుకుంది. ఈ పరిణామాన్ని వీఆర్‌ఏల దీర్ఘకాల సమస్యకు ఒక పరిష్కార దిశ. వీఆర్‌ఏ నుంచి డిప్యూటీ కలెక్టర్ వరకు విస్తరించిన రెవెన్యూ ఉద్యోగ సమూహంలో ప్రతి స్థాయికీ ప్రత్యేక సమస్యలు ఉంటాయి. అయినప్పటికీ ఉద్యోగ భద్రత, పదోన్నతులు, పని పరిస్థితులు, ఆత్మగౌరవం వంటి అంశాలు అందరినీ ఒక తాటిపైకి తీసుకొస్తాయి. ఈ సమష్టి ప్రయోజనాలను సంఘ కార్యాచరణలో నిలబెట్టేందుకు రవీందర్ రెడ్డి కృషి చేశారు.

## అధికారులతో సమన్వయం.. ప్రభుత్వంతో సంభాషణ

ఉద్యోగ సంఘానికి విశ్వసనీయత నాయకుడి స్పందనతో ఏర్పడుతుంది. సమస్య చెప్పుకున్నప్పుడు వినడం, దాని నేపథ్యాన్ని తెలుసుకోవడం, సాధ్యమైన పరిష్కారం కోసం ప్రయత్నించడం ఉద్యోగికి ధైర్యాన్నిస్తుంది. రవీందర్ రెడ్డిలో చూసిన ముఖ్యమైన లక్షణం ఈ స్పందనే. అన్యాయం జరిగిందని భావించిన ఉద్యోగి, పదోన్నతి కోసం ఎదురుచూస్తున్న సహచరుడు, ఉద్యోగ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న కుటుంబం.. ఇలాంటి అనేక సందర్భాల్లో ఆయనను ఆశ్రయించేవారు. తమ సమస్యను సంఘం తరఫున వినిపించే వ్యక్తి ఉన్నాడనే నమ్మకం వారికి భరోసా ఇచ్చింది. రాజకీయ మార్పుల అనంతరం భూభారతి చట్టం, గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు ముందుకు వచ్చాయి. మాజీ వీఆర్‌ఓలు, వీఆర్‌ఏల నుంచి ఎంపిక ప్రక్రియ ద్వారా 2025లో గ్రామ పరిపాలన అధికారుల నియామకాలు జరగడం.. గ్రామస్థాయిలో రెవెన్యూ సిబ్బంది అవసరం మరోసారి స్పష్టమైందనే అభిప్రాయానికి బలం చేకూర్చింది. భూ సమస్యలు, వారసత్వ వ్యవహారాలు, రికార్డుల నిర్వహణ వంటి అంశాలకు గ్రామస్థాయిలోనే స్పందించే వ్యవస్థ అవసరమన్న విషయాన్ని ఈ పరిణామాలు చాటాయి. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో రవీందర్‌రెడ్డి సంభాషణకు ప్రాధాన్యం ఇచ్చారు.

## పెద్దన్న..!

రవీందర్‌రెడ్డి గురించి సహచరులు చెప్పుకునే ముఖ్యమైన మాట ఒక్కటే.. "పెద్దన్న". ఉద్యోగ జీవితంలో హోదాలు మారినా.. సంఘ బాధ్యతలు పెరిగినా.. సహచరులతో ఆయన అనుబంధం మారలేదు. సమస్య ఉన్నప్పుడు అందుబాటులో ఉండటం, ఉద్యోగి చెప్పేది ఓపికగా వినడం, సాధ్యమైన పరిష్కారం కోసం ప్రయత్నించడం ఆయనకు సహజమైన విధానం. ఉద్యోగ, సంఘ జీవితంతోపాటు కుటుంబంలోనూ రవీందర్‌రెడ్డి పెద్దన్న పాత్రను కొనసాగించారు. ఇద్దరు తమ్ముళ్లను కలుపుకొని కుటుంబాన్ని ముందుకు నడిపించడంతోపాటు, ఇద్దరు కుమార్తెలను ఉన్నత విద్య చదివించి స్థిరపడేలా చేశారు. కుటుంబ సభ్యుల సహకారం తన ఉద్యోగ, సంఘ జీవితానికి ఎంతో తోడ్పడింది. 1987లో ప్రభుత్వ ఉద్యోగంలో అడుగుపెట్టిన రవీందర్‌రెడ్డి దాదాపు నాలుగు దశాబ్దాల సేవ అనంతరం పదవీ విరమణ చేయనున్నారు. అయితే, పదవీ విరమణతో ఆయన అనుభవం, సంఘంతో ఉన్న అనుబంధం ముగిసిపోదు. రెవెన్యూ వ్యవస్థలో ఎన్నో మార్పులను చూసిన అనుభవం.. ఉద్యోగుల సమస్యలను దగ్గరగా చూసిన పరిచయం.. సంఘ నాయకత్వంలో ఎదురైన అనేక పరిణామాలు.. భవిష్యత్తులోనూ ఉద్యోగులకు మార్గదర్శకంగా ఉంటాయి. సంఘం కోరుకున్న ప్రతిదీ సాధించడం అన్ని సందర్భాల్లో సాధ్యంకాదు. ప్రభుత్వ విధాన నిర్ణయాలు, రాజకీయ పరిస్థితులు, పరిపాలనా అవసరాలు ఫలితాలను ప్రభావితం చేస్తాయి. వీఆర్వో పోస్టుల రద్దును ఆపలేకపోయారు. తరువాత వీఆర్‌ఏ వ్యవస్థ స్థానంలో ఉద్యోగులను ఇతర ప్రభుత్వ పోస్టుల్లో సర్దుబాటు చేసే నిర్ణయం వచ్చింది. ఈ మార్పులు ఉద్యోగులకు కలిగించిన ఆవేదనను గుర్తించాలి. ఎన్నో సంవత్సరాలు పనిచేసిన వ్యవస్థ నుంచి మరో విధమైన బాధ్యతలకు మారడం సులభమైన విషయం కాదు. అదే సమయంలో ఉద్యోగ భద్రతను కాపాడటం, సిబ్బంది సేవలు ప్రభుత్వంలో కొనసాగేందుకు ప్రయత్నించడం అత్యవసరమైంది. అలాంటి సంధి కాలంలో రవీందర్ రెడ్డి కృషి ఎనలేనిది. అన్ని నిర్ణయాలను మార్చలేకపోయినా, ఉద్యోగుల పక్షాన వాదించడం, శాఖ అవసరాన్ని తెలియజేయడం, సాధ్యమైన రక్షణ కోసం ప్రయత్నించడంలో ఆయన పాత్ర ముఖ్యమైనది.

కుటుంబాలకు న్యాయం.. రవీందర్ రెడ్డికి బహుమానం

రవీందర్ రెడ్డి సేవలను గౌరవించే సందర్భంలో పెండింగ్‌లో ఉన్న ఒక ముఖ్యమైన అంశాన్ని ముందుకు తీసుకురావాలి. 61 ఏళ్లు దాటిన వీఆర్‌ఏల అర్హులైన కుమారులు, కుమార్తెలకు నియామకాలు కల్పించే అంశానికి 2023 ప్రభుత్వ నిర్ణయంలో ప్రస్తావన ఉంది. దాని అమలు కోసం ఇంకా ఎదురుచూస్తున్న కుటుంబాలకు స్పష్టమైన పరిష్కారం లభించాలి. ఈ అంశాన్ని ప్రభుత్వ నిర్ణయంలోని అర్హతలు, వర్తించే నిబంధనలు, న్యాయపరమైన పరిస్థితుల మేరకు పరిశీలించాలి. పెండింగ్‌లో ఉన్న అర్హులైన కుటుంబాల వివరాలను సమగ్రంగా సేకరించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి, ప్రతి కేసుకు స్పష్టమైన నిర్ణయం వచ్చేలా సంఘం కృషి చేయాలి. ఈ కుటుంబాలకు న్యాయం చేకూర్చడం రవీందర్ రెడ్డికి ట్రెసా అందించే ఘనమైన బహుమానం అవుతుంది. ప్రభుత్వం అర్హులైన కుటుంబాల సమస్యను పరిష్కరించడం ఆయన సేవలకు సముచితమైన గౌరవంగా నిలుస్తుంది. సన్మాన వేదికపై వెలువడే ప్రశంసలకు, ఆ కుటుంబాల జీవితాల్లో కలిగే భరోసా తోడైతే ఈ సందర్భం మరింత సార్థకమవుతుంది.

అక్టోబర్ 6న
వంగ రవీందర్ రెడ్డి
పదవీ విరమణ



"ఉద్యోగ జీవితం ఒక వైపు..
ట్రెసా జీవితం మరో వైపు..
రెండింటా సహచరులే కేంద్రంగా పయనం..
రవన్నా.. ఎప్పటికీ నువ్వు మా పెద్దన్నే!
మీ సేవలకు వందనం..!
తెగిపోదు మన అనుబంధం..!
మా గుండెల్లో నీ స్థానం చిరకాలం..!"

పీ రాజకుమార్
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, ట్రెసా



## ఇక్కడే గుండెను గుచ్చే ప్రశ్న వస్తుంది.

పెద్ద కంపెనీ అయినా.. చిన్న కంపెనీ అయినా.. ప్రజల ఆహారం విషయంలో ఇంత గందరగోళం ఎందుకు? ప్యాకెట్ తయారైపోయింది. దేశమంతా సరఫరా అయింది. దుకాణాల షెల్ఫ్‌లపైకి వెళ్లింది. ప్రజలు కొనుక్కున్నారు. కొందరు తిన్నారు కూడా. ఆ తర్వాత నమూనా తీసి పరీక్షిస్తే 'అసురక్షితం' అని బయటపడుతోంది. అంటే.. ప్రజలు ముందుగా తిని పరీక్షించాలా? ప్రభుత్వం ముందుగా పరీక్షించాలా? ప్రజల ఆరోగ్యం ప్రయోగశాల కాదు. ఇక పరిశుభ్రత విషయంలోనూ పరిస్థితి భిన్నంగా లేదు. క్రియేటివ్ బేకర్స్ అండ్ కన్ఫెక్షనర్స్‌కు చెందిన 'ది షుగర్ అండ్ స్పైస్' కేంద్రాలపై తీవ్రమైన పరిశుభ్రత, పారిశుద్ధ్య, ఆహార భద్రత లోపాలు గుర్తించడంతో ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సును నిలిపివేసింది. ఇవి బయటపడినవి. బయటపడనివి ఎన్ని? అదే అసలు భయం.

పండుగ వస్తే స్వీట్ల దుకాణాలపై దాడులు. వార్తల్లో కల్తీ నూనె. ఇంకోరోజు కల్తీ పాలు. మరోరోజు నకిలీ మసాలాలు. ఎక్కడో రంగులు కలిపిన మిఠాయిలు. ఎక్కడో గడువు ముగిసిన పదార్థాలు. ఇది కొత్త విషయం కాదు. ప్రతి ఏడాది ఇదే తంతు. దాడులు జరుగుతాయి. నమూనాలు తీస్తారు. కేసులు పెడతారు. కొన్ని ఉత్పత్తులను వెనక్కి తీసుకుంటారు. మళ్లీ అంతా మామూలే. ఇది ఆహార భద్రత వ్యవస్థ కాదు. ఇది ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే వ్యవస్థ. ప్రజలు మాత్రం ప్రతిరోజూ తింటూనే ఉంటారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ స్వయంగా ఆహార వ్యాపార సంస్థకు తన ఉత్పత్తి నిబంధనలకు అనుగుణంగా లేదని తెలిసినా, మార్కెట్‌లో ఉన్న ఆహారాన్ని వెంటనే ఉపసంహరించాల్సిన బాధ్యత ఉందని చెబుతోంది. ఆహార ఉపసంహరణకు ప్రత్యేక వ్యవస్థ కూడా ఉంది.



# బ్రాండెడ్ విషం

# తింటున్నాం!

### ఆహార ఉత్పత్తుల్లో విషపదార్థాలు.. పెద్ద కంపెనీలే.. పెద్ద పెద్ద మోసాలు

### ఒంటిని గుల్లచేసే పురుగుల మందులు.. ప్రమాణాలకు విరుద్ధంగా పదార్థాలు

## ప్యాకెట్‌పై పెద్ద బ్రాండ్..

**లోపల పురుగుమందుల అవశేషాలు!**

**శిశువుల ఆహారంలో ప్రమాణాల లోపాలు!**

**నెయ్యిలో కల్తీ అనుమానాలు!**

**అయినా ప్రభుత్వాలు నిద్రలో జోగుతున్నాయి.**



*పేదోడు నాలుగు రూపాయలు ఎక్కువైనా సరే.. "ప్యాకెట్ మీద పెద్ద కంపెనీ పేరు ఉంది.. నాణ్యంగా ఉంటుందిలే" అని నమ్మి కొంటాడు. మధ్యతరగతి కుటుంబం పిల్లలకు మంచిదని భావించి ఖరీదైన ఆహారం పెడుతుంది. కానీ అదే ప్యాకెట్‌ను ప్రభుత్వం పరీక్షించి 'అసురక్షితం', 'ప్రమాణాలకు విరుద్ధం' అని చెప్పినప్పుడు సామాన్యుడి నమ్మకం ఎక్కడికి పోవాలి? ఇటీవలి ఎఫ్ఎస్ఎస్ఏఐ చర్యలు ఈ ప్రశ్ననే ప్రజల ముందుకు తెచ్చాయి. తాజాగా ఎవరెస్ట్ జీలకర్ర పొడికి చెందిన ఒక నమూనాలో అనుమతించిన పరిమితికి మించి అజాక్సిస్ట్రోబిన్, థయామెథాక్సామ్ పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లు ఆహార విశ్లేషకుడి పరీక్షలో తేలింది. ఆ నమూనాను 'అసురక్షితం'గా ప్రకటించడంతో సంబంధిత బ్యాచ్‌ను వెనక్కి తీసుకోవాలని ఆదేశించారు.*

*ఇది చిన్న విషయం కాదు. రోజూ వంటింట్లో పడే జీలకర్ర పొడి. పిల్లల నుంచి పెద్దల వరకు తినే ఆహారం. అలాంటి పదార్థంలోనే అనుమతికి మించిన రసాయన అవశేషాలు ఉన్నాయంటే.. మన వంటగదిలోకి ఏం వస్తోంది? మన కడుపులోకి ఏం వెళ్తోంది? అన్నది ప్రశ్న. ఇంకోవైపు నెస్లేకు సంబంధించిన శిశు ఆహార ఉత్పత్తులపై కూడా ఎఫ్ఎస్ఎస్ఏఐ చర్యలు చేపట్టింది. 'ఫాలో-అప్ ఫార్ములా'గా పేర్కొన్న ఒక పాల ఉత్పత్తి నమూనాలో విటమిన్ బి7గా పిలిచే బయోటిన్ ప్రమాణం సరిపోలలేదని నియంత్రణ సంస్థ తెలిపింది. 'నాన్-కన్ఫార్మింగ్'గా పేర్కొంటూ చట్టపరమైన చర్యలు చేపట్టింది. అదే సంస్థకు చెందిన నాన్ ఎక్సెల్లా ప్రో స్టేజ్ 1, లాక్టోజెన్ ప్రో 1 ఉత్పత్తుల ప్రచార వాదనలపైనా కేసులు నమోదయ్యాయి. నెస్లే మాత్రం తన ఉత్పత్తులు వర్తించే నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని పేర్కొంది.*

## కానీ ప్రశ్న ఒక్కటే..

ఉపసంహరణ ఎప్పుడు? ప్రజలు కొనేసిన తర్వాతా? తినేసిన తర్వాతా? ప్రభుత్వాల బాధ్యత కేవలం ప్రమాదకర ఉత్పత్తిని పట్టుకోవడం కాదు. అది మార్కెట్‌లోకి రాకుండా చూడటం. ప్రతి జిల్లాలో సరిపడా ఆహార భద్రత అధికారులు ఉన్నారా? ప్రతి మండలంలో క్రమం తప్పకుండా తనిఖీలు జరుగుతున్నాయా? ప్రయోగశాలల్లో పరీక్షల సామర్థ్యం సరిపోతుందా? తీసుకున్న నమూనాల ఫలితాలు ప్రజలకు సకాలంలో అందుతున్నాయా? ప్రమాదకర ఉత్పత్తి ఏ ప్రాంతాల్లో అమ్ముడైందో ప్రజలకు వెంటనే చెబుతున్నారా? ఈ ప్రశ్నలకు ప్రభుత్వాలు ప్రజల ముందు సమాధానం చెప్పాలి. 'ఫుడ్ సేఫ్టీ' అనేది పత్రికల్లో ప్రకటన కాదు. ప్రజల పళ్లెంలో ఉండాల్సిన భద్రత.

పేదోడు తక్కువ ధరకు దొరికిందని కొనుక్కున్నా ప్రమాదమే. మధ్యతరగతి పెద్ద బ్రాండ్ అని నమ్మి కొనుక్కున్నా అనుమానమే. చిన్న పిల్లలకు ప్రత్యేక ఆహారం అని కొన్నా ప్రశ్నలే. అయితే సామాన్యుడు ఎవరిని నమ్మాలి? బ్రాండ్‌ను నమ్మాలా? ప్రభుత్వ ముద్రను నమ్మాలా? లేక ప్రతి ప్యాకెట్‌ను తానే ప్రయోగశాలకు పంపించుకోవాలా? ఇది వినియోగదారుడి పని కాదు. ప్రజలు ఆహారం కొనాలి. ప్రభుత్వం ఆ ఆహారం సురక్షితమని నిర్ధారించాలి. వ్యాపారి నిబంధనలు పాటించాలి. తప్పు చేస్తే కఠిన చర్యలు ఉండాలి. అంతే. పెద్ద కంపెనీలపై చర్యలు తీసుకున్నామని ప్రభుత్వాలు గొప్పగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. పెద్ద కంపెనీల ఉత్పత్తులు కూడా పరీక్షించాల్సి వస్తున్న పరిస్థితి ఎందుకు వస్తోంది? చిన్న వ్యాపారుల నుంచి బహుళజాతి సంస్థల వరకు ఒకే ప్రమాణాలు ఎందుకు కచ్చితంగా అమలు కావడం లేదు? అనేదే అసలు ప్రశ్న.

ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేయడానికి ఎవరికీ హక్కు లేదు. లాభం వ్యాపారానికి అవసరం కావచ్చు.. కానీ ప్రజల ప్రాణాల కంటే లాభం పెద్దది కాదు. ఇక ప్రభుత్వాలు మేల్కొనాల్సిన సమయం వచ్చింది. పండుగల ముందు మాత్రమే కాదు.. ప్రతిరోజూ తనిఖీలు కావాలి. కల్తీ బయటపడిన తర్వాత మాత్రమే కాదు.. ముందే అడ్డుకోవాలి. ప్రమాదకర ఆహారం దొరికిన తర్వాత మాత్రమే కాదు.. దాని మూలాన్ని గుర్తించాలి. ఒక కంపెనీపై చర్య తీసుకుని చేతులు దులుపుకోవడం కాదు.. అలాంటి ఉత్పత్తి మార్కెట్‌లోకి ఎలా వచ్చింది? ఎవరు తనిఖీ చేశారు? ఎక్కడ వ్యవస్థ విఫలమైంది? అన్నదీ తేల్చాలి. ఎందుకంటే మనిషి ఒక్కసారి పోయిన ఆరోగ్యాన్ని ప్యాకెట్ మార్చి తిరిగి తెచ్చుకోలేడు. ప్రజల తిండి మీదే ప్రభుత్వాల బాధ్యత పరీక్షకు వస్తోంది. ఇకనైనా ప్రభుత్వాలు గుర్తుపెట్టుకోవాలి. ప్రజలు ప్రభుత్వాల నుంచి ఉచిత ఆహారం అడగడం లేదు. తాము డబ్బులు పెట్టి కొంటున్న ఆహారం విషం కాదని మాత్రం హామీ కోరుతున్నారు.

**ఆ హామీ ఇవ్వలేని వ్యవస్థకు**

**ఎన్ని తనిఖీలు చేసినా..**

**ఎన్ని ప్రకటనలు ఇచ్చినా..**

**ఎన్ని 'చర్యలు' ప్రకటించినా..**

**ప్రజల కడుపులో భద్రత రాదు.**

**తినే ముందు పరీక్షించాలి.. తిన్న తర్వాత కాదు.**

**ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి..**

**ప్రమాదం బయటపడిన తర్వాత కాదు.**



# మన సింగం..

# రాక్ స్టార్!

### తూకారాం ముండేకు న్యూయార్క్ టైమ్స్‌లో అరుదైన గుర్తింపు

### ఫ్రంట్ పేజీలో 'రాక్‌స్టార్'గా అభివర్ణన.. రెస్టారెంట్లపై ఆకస్మిక తనిఖీలు, ప్రముఖ ఫుడ్ బ్రాండ్లపై చర్యలు

న్యూఢిల్లీ: కఠిన చర్యలతో ఇప్పటికే దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఐఏఎస్ అధికారి తూకారాం ముండే పేరు ఇప్పుడు అంతర్జాతీయ మీడియా వేదికపై మార్మోగింది. మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా పరిశుభ్రత నిబంధనలు పాటించని రెస్టారెంట్లు, ఫుడ్ స్టోర్లపై కొరడా ఝుళిపిస్తున్న ముండేను 'ది న్యూయార్క్ టైమ్స్' ఏకంగా 'రాక్‌స్టార్'గా అభివర్ణించింది. ఆ పత్రిక ఫ్రంట్ పేజీలోనే ఆయనపై ప్రత్యేక కథనం ప్రచురించడం విశేషం. న్యూయార్క్ టైమ్స్ "ఇన్ ఇండియా, ఏ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఈజ్ ఏ రాక్‌స్టార్" అనే శీర్షికతో ముండేపై కథనం ప్రచురించింది. "డైనర్స్ రెవర్ హిమ్ అండ్ ఓనర్స్ ఫియర్ హిమ్" అంటూ ఆయనకు వినియోగదారుల్లో ఉన్న అభిమానాన్ని, రెస్టారెంట్ యజమానుల్లో ఉన్న భయాన్ని ప్రస్తావించింది. వెబ్ కథనంలో ఆయన్ను 'ఫుడ్ సేఫ్టీ సెలబ్రిటీ'గా పేర్కొంది. ఆకస్మిక తనిఖీలతో ముండే ఇప్పటికే దేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. రెస్టారెంట్లు, ఫుడ్ షాపులు, గోదాములు, క్విక్ కామర్స్ డార్క్ స్టోర్లలో తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు 'ఐఏఎస్ సింగం' అనే పేరు కూడా వచ్చింది. 'డొమినోస్', 'పిజ్జా హట్' ఔట్‌లెట్లలో తనిఖీల సందర్భంగా వంటగదుల్లో బొద్దింకలు, గడువు ముగిసిన ఉత్పత్తులు గుర్తించడంతో వాటిని తాత్కాలికంగా మూసివేశారు. ముంబయిలోని



కొన్ని ప్రముఖ పాతకాలపు ఫుడ్ బిజినెస్‌ల లైసెన్సులపైనా తాత్కాలిక సస్పెన్షన్ వేటు పడింది. క్విక్ కామర్స్ సంస్థలు బ్లింకిట్, జెప్టోకు చెందిన డార్క్ స్టోర్లలోనూ తనిఖీలు జరిగాయి. అక్కడ బల్లులు, బొద్దింకలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు కథనాలు వెలువడ్డాయి. రెస్టారెంట్ యజమానులపై చర్యలు తీసుకుంటున్న ముండే.. పరిశుభ్రమైన ఆహారం కోరుకునే వినియోగదారుల్లో మాత్రం ప్రత్యేక అభిమానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పుడు ఆ గుర్తింపే అంతర్జాతీయ స్థాయికి చేరింది. భారత్‌లో 'ఐఏఎస్ సింగం'గా పేరొందిన ఆయనను న్యూయార్క్ టైమ్స్ 'రాక్‌స్టార్'గా అభివర్ణించడం గమనార్హం.

# సూపర్ ఇంటెలిజెన్స్'తో పెను ముప్పు

### దేశాలన్నీ ఏకం కావాలి.. సాఫ్ట్‌బ్యాంక్ సీఈఓ మసయోషి సన్

టోక్యో: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అతిపెద్ద ఇన్వెస్టర్లలో ఒకరైన సాఫ్ట్‌బ్యాంక్ సీఈఓ మసయోషి సన్, ఏఐ భవిష్యత్తుపై కీలక హెచ్చరికలు జారీ చేశారు. సూపర్ ఇంటెలిజెన్స్ (ఎస్ఐ) తప్పుడు చేతుల్లోకి వెళితే అది "అత్యంత ప్రమాదకరంగా" మారే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జపాన్‌లోని క్యోటోలో జరిగిన సైన్స్ అండ్ టెక్నాలజీ ఫోరమ్ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మసయోషి సన్ మాట్లాడుతూ, ఏఐ సామర్థ్యం అనూహ్యంగా, వేగంగా పెరుగుతున్న తరుణంలో దేశాల మధ్య నమ్మకం, సహకారం అత్యంత అవసరమని నొక్కిచెప్పారు. "మానవుడు మానవుడితో పోరాడే విలాసవంతమైన సమయం మనకు ఇక లేదు. అంతకంటే పెద్ద ముప్పు అయిన శక్తివంతమైన ఏఐని నియంత్రించడానికి ప్రపంచ దేశాలన్నీ కలిసి పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఏఐ వల్ల మానవాళికి ఎంతో ప్రయోజనం ఉందని చెబుతూ వచ్చిన సన్, ఈసారి అందుకు భిన్నంగా ఆచితూచి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవలి కాలంలో ఏఐ మోడళ్ల భద్రతకు సంబంధించి తలెత్తిన ఆందోళనల నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ఈ మార్పును ప్రతిబింబిస్తున్నాయి. ఓపెన్‌ఏఐలో సాఫ్ట్‌బ్యాంక్ సుమారు 65 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టిన విషయం తెలిసిందే. ఇదే వేదికపై వైట్‌హౌస్ సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీ సలహాదారు మైఖేల్ క్రాట్సియోస్ మాట్లాడుతూ, శాస్త్రీయ పరిశోధనలను వేగవంతం చేసేందుకు



ఏఐని ఉపయోగించుకోవడం లక్ష్యంగా అమెరికా నేతృత్వంలో ఒక కూటమిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. జపాన్, దక్షిణ కొరియా, యూకే, జర్మనీ, సింగపూర్, యూఏఈ సహా 17 దేశాలు ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. అయితే, ప్రారంభ జాబితాలో చైనాకు చోటు దక్కలేదు. ఈ కూటమి ద్వారా భవిష్యత్తులో ఆటోమేటెడ్ క్లౌడ్ ల్యాబొరేటరీలను ఏర్పాటు చేసి, రోబోటిక్ వ్యవస్థల ద్వారా వందలాది ప్రయోగాలను ఏకకాలంలో నిర్వహిస్తారని క్రాట్సియోస్ వివరించారు. దీనివల్ల ఏళ్ల తరబడి పట్టే పరిశోధనలు కేవలం కొన్ని గంటల్లోనే పూర్తవుతాయని తెలిపారు. అనంతరం మసయోషి సన్ మాట్లాడుతూ, 2040 నాటికి ప్రపంచ జీడీపీలో కనీసం 20 శాతం వాటా (సుమారు 46 ట్రిలియన్ డాలర్లు) ఏఐ, లెర్నింగ్ మెషీన్ల ద్వారానే సమకూరుతుందని తన దీర్ఘకాలిక అంచనాను పునరుద్ఘాటించారు. ఏఐ పురోగతి మూడు దశల్లో ఉంటుందని, ప్రస్తుతం చాట్‌బాట్ల దశలో ఉన్నామని, తర్వాత బ్రౌజింగ్, కోడింగ్ దశకు, వచ్చే ఏడాది నుంచి రోబోట్లు, యంత్రాలతో భౌతిక పరస్పర చర్యల దశకు చేరుకుంటామని విశ్లేషించారు. ప్రస్తుత పరిణామాలు కేవలం ఆరంభం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు.

# క్యాష్.. ఆర్బీఐ 'క్యాష్'!

### ఒక్కరోజులో రూ.2.10 లక్షల కోట్లు వెనక్కి

### వీఆర్ఆర్ఆర్ వేలం ద్వారా డబ్బు తీసుకున్న ఆర్బీఐ

న్యూఢిల్లీ: బ్యాంకింగ్ వ్యవస్థలో భారీగా ఉన్న అదనపు నగదును 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఆర్‌బీఐ) వెనక్కి తీసుకుంది. సోమవారం నిర్వహించిన రెండు ఓవర్‌నైట్ 'వేరియబుల్ రేట్ రివర్స్ రెపో' (వీఆర్ఆర్ఆర్) వేలం ద్వారా బ్యాంకుల నుంచి ఏకంగా రూ.2,10,192 కోట్లను ఆర్బీఐ వెనక్కి లాగింది. బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దాన్ని నియంత్రించేందుకు ఈ చర్య చేపట్టింది. మొదటి వేలంలో రూ.2 లక్షల కోట్లను తీసుకునేందుకు ఆర్బీఐ నోటిఫై చేయగా.. బ్యాంకులు రూ.2,10,688 కోట్లకు బిడ్లు దాఖలు చేశాయి. ఇందులో రూ.2,00,050 కోట్లను ఆర్బీఐ స్వీకరించింది. సగటు వడ్డీ రేటు 5.24 శాతంగా నమోదైంది. రెండో వేలంలో మాత్రం బ్యాంకుల నుంచి స్పందన తక్కువగా వచ్చింది. రూ.50 వేల కోట్లను తీసుకునేందుకు ఆర్బీఐ అవకాశం కల్పించగా.. కేవలం రూ.10,142 కోట్లకు బిడ్లు వచ్చాయి. వచ్చిన మొత్తం బిడ్లను ఆర్బీఐ స్వీకరించింది. ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థలో అదనపు నగదు భారీగా ఉంది. అక్టోబర్ 4 నాటికి ఈ మిగులు లిక్విడిటీ సుమారు రూ.5.16 లక్షల కోట్లుగా ఉన్నట్లు ఆర్బీఐ గణాంకాలు చెబుతున్నాయి. గత రెండు నెలలుగా ఆర్బీఐ పలుమార్లు వీఆర్ఆర్ఆర్ వేలాలు నిర్వహిస్తూ ఈ అదనపు నగదును తగ్గిస్తోంది. స్వల్పకాలిక రుణ మార్కెట్‌లో వడ్డీ రేట్లు రెపో రేటుకు దగ్గరగా ఉండేలా చూడటం కూడా దీని లక్ష్యం. విదేశాల్లో ఉన్న భారతీయులు బ్యాంకుల్లో జమ చేసిన ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్లతో పాటు.. నెలాఖరులో ప్రభుత్వం జీతాలు, పెన్షన్ల కోసం చేసే చెల్లింపులు కూడా బ్యాంకుల్లో నగదు లభ్యతను పెంచాయి. లిక్విడిటీ ఇంకా ఎక్కువగానే ఉండటంతో.. రానున్న రోజుల్లోనూ వీఆర్ఆర్ఆర్ వంటి చర్యలను ఆర్బీఐ కొనసాగించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.



లవ్లీ చిత్రం



# రజనీ వేట.. జైలర్ 2 ట్రైలర్ రిలీజ్

సూపర్‌స్టార్ రజినీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'జైలర్ 2' సినిమా నుంచి అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించిన పవర్‌ఫుల్ ట్రైలర్‌ను సోమవారం చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ విడుదల చేసింది. ఆద్యంతం యాక్షన్ సన్నివేశాలు, ఆకట్టుకునే సంభాషణలతో నిండిన ఈ ట్రైలర్, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. "టైగర్ ముత్తువేల్ పాండియన్ తిరిగి వచ్చాడు. వేట మొదలైంది!" అనే క్యాప్షన్‌తో సన్ పిక్చర్స్ సోషల్ మీడియాలో ఈ ట్రైలర్‌ను పంచుకుంది. ట్రైలర్ ప్రారంభంలో, నటుడు సూరజ్ వెంజరమూడు పాత్ర తన వద్ద బందీగా ఉన్న వ్యక్తిని ప్రశ్నించడంతో మొదలవుతుంది. "గత రెండు నెలల్లో ఈ పని చేసిన వ్యక్తి గురించి నీకు ఏమైనా తెలిసిందా?" అని అడగ్గా, "నాకే కాదు, నువ్వు కూడా అతడిని కనిపెట్టలేవు" అని బందీ సమాధానమిస్తాడు. కేవలం సూరజ్ పాత్రే కాకుండా, చాలా మంది విలన్లు తమకు జరుగుతున్న నష్టం వెనుక ఎవరున్నారని తలలు పట్టుకుంటున్నట్టు ట్రైలర్‌లో చూపించారు. ఆ తర్వాతే టైగర్ ముత్తువేల్ పాండియన్‌గా రజినీకాంత్ స్టైల్‌గా ఎంట్రీ ఇస్తారు. కథనం ప్రకారం, ముత్తువేల్ పాండియన్ ఒక డ్రైవర్‌గా నటిస్తూ అండర్‌కవర్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. విలన్ల నెట్‌వర్క్‌లో ఇంకా పెద్ద తలలు ఎవరైనా ఉన్నారా అని కనిపెట్టేందుకే అతను ఈ వ్యూహం పన్నినట్టు ట్రైలర్‌ను బట్టి అర్థమవుతోంది. తన శత్రువులను అంతం చేయడానికి టైగర్ స్నైపర్లను ఉపయోగించగా, తాము కూడా స్నైపర్లను వాడగలమని విలన్‌గా నటిస్తున్న ఎస్.జె. సూర్య చెప్పడం ఆసక్తిని రేపుతోంది.






## హనుమాన్ అంశ్ తెలుగు
# ట్రైలర్ విడుదల

చిన్న సినిమాగా విడుదలై యావత్ దేశాన్ని ఆశ్చర్యపరిచిన ఆధ్యాత్మిక చిత్రం 'హనుమాన్ అంశ్' ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. కేవలం రూ. 2 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి, బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 423 కోట్ల వసూళ్లతో సంచలనం సృష్టించిన ఈ చిత్రాన్ని తెలుగులో 'కేజీఎఫ్', 'సలార్' వంటి భారీ చిత్రాల నిర్మాణ సంస్థ హోంబలే ఫిలింస్ విడుదల చేస్తోంది. అక్టోబర్ 9న ఈ సినిమాను థియేటర్లలోకి తీసుకురానుండగా, తాజాగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలీ బాబా జీవితం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. విడుదలైన తెలుగు ట్రైలర్ ఎంతో ఆహ్లాదకరంగా, ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. బ్రిటిష్ కాలం నాటి సన్నివేశాలు, సామాన్య వ్యక్తిగా ఉన్న ఆయన సన్యాసిగా మారే క్రమం, ప్రజలతో చమత్కారంగా, స్ఫూర్తిదాయకంగా సంభాషించే తీరును ట్రైలర్‌లో చక్కగా చూపించారు. ఆయనను భార్య వదిలేస్తాననే సన్నివేశాలు, చివర్లో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ చేసి బాబా నిష్క్రమణకు సిద్ధమయ్యే దృశ్యాలు భావోద్వేభరితంగా, కంటతడి పెట్టించేలా ఉన్నాయి. తొలుత ఈ సినిమా తెలుగు రైట్స్‌ను త్రివిక్రమ్ శ్రీనివాస్ దక్కించుకుంటారని ప్రచారం జరిగినా, చివరికి హోంబలే ఫిలింస్ ఈ చిత్రాన్ని సొంతం చేసుకుని భారీ స్థాయిలో విడుదల చేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఎటువంటి అంచనాలు లేకుండా వచ్చి, బడ్జెట్‌కు 200 రెట్లకు పైగా వసూళ్లు సాధించి చరిత్ర సృష్టించిన ఈ ఆధ్యాత్మిక డ్రామా, తెలుగులోనూ అదే స్థాయి విజయాన్ని అందుకుంటుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. అక్టోబర్ 9న 'హనుమాన్ అంశ్' తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది.




# ఆదర్శ కుటుంబం రిలీజ్ వాయిదా

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా విడుదల వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 9న థియేటర్లలోకి రావాల్సి ఉండగా, కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు నిర్మాత నాగవంశీ అధికారికంగా ప్రకటించారు. ఈ ఆకస్మిక పరిణామంతో వెంకటేశ్ అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. సినిమా వాయిదాకు గల కారణాలను నిర్మాత నాగవంశీ స్పష్టంగా వివరించారు. ఆయన మాట్లాడుతూ.. "సినిమాకు సంబంధించిన తుది దశ పనులు ఇంకా పూర్తి కాలేదు. మరో రెండు, మూడు పాటల చిత్రీకరణతో పాటు, కొన్ని కీలక సన్నివేశాల షూటింగ్ కూడా మిగిలి ఉంది. వీటికి తోడు ప్రచార కార్యక్రమాలను కూడా ప్రారంభించాల్సి ఉంది. ఈ పనులన్నీ పూర్తి చేయడానికి కనీసం రెండు నుంచి మూడు వారాల సమయం పడుతుంది.. సోషల్ మీడియాలో ఎవరూ వేలెత్తి చూపకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని తెలిపారు. నిర్ణయించిన తేదీకే విడుదల చేయాలనే తొందరలో నాణ్యతతో రాజీ పడలేమని నాగవంశీ పేర్కొన్నారు. "ప్రేక్షకులతో పాటు మేం కూడా థియేటర్‌లో సినిమా ఫైనల్ కాపీ చూడటం మాకు ఇష్టం లేదు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న కాపీనే థియేటర్లకు అందిస్తాం. సినిమా నాణ్యతకే మా మొదటి ప్రాధాన్యత. అందుకే పూర్తి సంతృప్తిగా అన్ని పనులు ముగించుకుని, కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాం" అని ఆయన వివరించారు. ప్రస్తుతం చిత్ర బృందం మిగిలి ఉన్న పనులను వేగంగా పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. అయితే పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని అక్టోబర్ 30న విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మొత్తానికి, భారీ అంచనాలతో ఎదురుచూస్తున్న ఈ సినిమా కోసం అభిమానులు మరికొంత కాలం వేచి చూడక తప్పదు.

# డీప్‌ఫేక్ అకౌంట్లపై 'మా' నిఘా

తెలుగు చిత్ర పరిశ్రమను లక్ష్యంగా చేసుకుని డీప్‌ఫేక్ వీడియోలు, నెగెటివిటీని వ్యాప్తి చేస్తున్న సోషల్ మీడియా ఖాతాలు, నెట్‌వర్క్‌ల వివరాలను సేకరిస్తున్నామని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణు వెల్లడించారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమస్యపై శాశ్వత పరిష్కారం కోసం పరిశ్రమలోని కీలక విభాగాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఏఐ డీప్‌ఫేక్ వీడియో ఘటనపై మంచు విష్ణు స్పందిస్తూ, దీనిని ఒకరిద్దరికి సంబంధించిన సమస్యగా కాకుండా, మొత్తం పరిశ్రమకు ఇది ఒక హెచ్చరికగా భావించాలని అన్నారు. హీరో రామ్ పోతినేని వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. "వారికి ముఖం లేదు, అందుకే భయం లేదు" అని, ఇలాంటి వారిని కట్టడి చేయాలంటే ఆన్‌లైన్ ఖాతాలకు ఆధార్‌తో అనుసంధానించే అంశంపై చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. దీని ద్వారా ఆన్‌లైన్‌లో జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన సూచించారు. కొందరు నటుల ఫొటోలతో ఫ్యాన్ పేజీల రూపంలో నకిలీ ఖాతాలు సృష్టించి, వాటి ద్వారా ద్వేషాన్ని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని విష్ణు విమర్శించారు. ఈ నెగెటివిటీలో కొంత పరిశ్రమలోపలి నుంచే వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఖాతాలు, వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై 'మా' పూర్తి సమాచారాన్ని సేకరిస్తోందని, తగిన ఆధారాలతో చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని స్పష్టం చేశారు.





## బాలయ్య సినిమాలో
# విలన్‌గా రాజశేఖర్?

నటసింహం నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలయ్య మాస్ ఇమేజ్‌కు, కొరటాల శివ మార్క్ కథా కథనాలు, సామాజిక అంశాలు తోడైతే సినిమా ఏ స్థాయిలో ఉంటుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం టాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇందులో బాలకృష్ణను ఢీకొట్టే ప్రధాన ప్రతినాయకుడి పాత్ర కోసం సీనియర్ హీరో డాక్టర్ రాజశేఖర్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు ఫిలింనగర్‌లో టాక్ వినిపిస్తోంది. యాక్షన్ సినిమాలతో పాటు విభిన్నమైన పాత్రల్లో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్.. ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. కొరటాల శివ రూపొందిస్తున్న కథలో ఈ విలన్ పాత్రకు మంచి ప్రాధాన్యత ఉందని, బలమైన వ్యక్తిత్వంతో పాటు ఇంటెన్స్ సన్నివేశాలు, పదునైన డైలాగులు ఉంటాయని టాక్. బాలకృష్ణ లాంటి మాస్ హీరోకు ఎదురుగా అదే స్థాయిలో స్క్రీన్ ప్రెజెన్స్ ఉన్న నటుడు ఉంటే సినిమాకు మరింత బలం చేకూరుతుందని దర్శకుడు భావించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే రాజశేఖర్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది.



# నాకేం సంబంధం

తన పేరును ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ సోదాలతో ముడిపెడుతూ వస్తున్న వార్తలపై బాలీవుడ్ నటి రకుల్ ప్రీత్ సింగ్ తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఆ సోదాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా కొన్ని మీడియా సంస్థలు, ఆన్‌లైన్ రిపోర్టర్లు వార్తలను సంచలనం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "కొందరు ఆన్‌లైన్ రిపోర్టర్లు, కొన్ని ప్రధాన మీడియా సంస్థల్లో వాస్తవాలను నిర్ధారించుకోకుండా వార్తలను సంచలనం చేసే ధోరణి పెరుగుతుండటం బాధాకరం. అందుకే ఒకేసారి అందరికీ స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఆ సోదాలు నాకు సంబంధించినవి కావు" అని రకుల్ తన ప్రకటనలో పేర్కొన్నారు. తన నేపథ్యం గురించి వివరిస్తూ.. "నేను ఆర్మీ కుటుంబం నుంచి వచ్చాను. ఇండస్ట్రీలో నాకు ఎలాంటి గాడ్‌ఫాదర్ లేరు. కేవలం నా కష్టంతోనే ఈ స్థాయికి వచ్చాను. చట్టాన్ని గౌరవించే పౌరురాలిగా 20 ఏళ్ల వయసు నుంచే క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నాను" అని ఆమె తెలిపారు. ఆర్థిక అవకతవకల ఆరోపణలను కూడా ఆమె ఖండించారు. "వ్యక్తిగతంగా గానీ, ఏ నిర్మాణ సంస్థ తరఫున గానీ నేను ఎలాంటి అక్రమ విదేశీ లావాదేవీలలో పాలుపంచుకోలేదు. దేశంలో లేదా విదేశాల్లో ఎవరి పేరు మీద కూడా నేను బినామీ ఆస్తులు కలిగి లేను. నాకు ఎవరూ ఎప్పుడూ ఎలాంటి ఆస్తులను బహుమతిగా ఇవ్వలేదు. అలాంటి ఖరీదైన బహుమతులు తీసుకోకూడదన్నది నా నియమం" అని రకుల్ స్పష్టం చేశారు.




# వరల్డ్ కప్‌లో రోహిత్ కీలకం: దినేశ్ కార్తీక్

2027 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టుకు సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ సేవలు అత్యంత కీలకం కానున్నాయని టీమిండియా మాజీ వికెట్ కీపర్–బ్యాటర్ దినేశ్ కార్తీక్ అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ అపారమైన అనుభవం, ప్రస్తుత ఫామ్ జట్టుకు అతిపెద్ద బలమని, ముఖ్యంగా యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు అతని మార్గదర్శకత్వం ఎంతో అవసరమని కార్తీక్ పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న ప్రస్తుత సిరీస్‌ను దినేశ్ కార్తీక్ ఉదాహరణగా చూపించాడు. గువాహటిలో జరిగిన మ్యాచ్‌లో ఛేజింగ్ సమయంలో రోహిత్ శర్మ సాధించిన సెంచరీ అతని ఫామ్‌కు నిదర్శనమని ప్రశంసించాడు. ఆటలో ఎదురయ్యే తీవ్ర ఒత్తిడితో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడంలో రోహిత్ అనుభవం గిల్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నాడు. ఈ విషయంపై కార్తీక్ మాట్లాడుతూ.. "ఒక కెప్టెన్‌గా, నాయకుడిగా ఆటలో ఉత్కంఠభరితమైన క్షణాల్లో రోహిత్ ఇచ్చే సలహాలు అమూల్యమైనవి. ముఖ్యంగా ఒక పెద్ద మ్యాచ్‌లో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కచ్చితంగా రోహిత్ వైపే చూస్తాడని, అతనిపైనే ఆధారపడతాడని నేను భావిస్తున్నాను" అని స్పష్టం చేశాడు. సీనియర్ ఆటగాడిగా, మాజీ కెప్టెన్‌గా జట్టులో రోహిత్ పోషించే పాత్ర కీలకమని పేర్కొన్నాడు.

# పాక్ టీ20 కొత్త కెప్టెన్‌గా ఫర్హాన్

పాకిస్తాన్ క్రికెట్‌లో కీలక మార్పు చోటు చేసుకుంది. ఆ దేశ టీ20 జట్టుకు కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేశారు. ఏషియన్ గేమ్స్‌లో తాత్కాలిక సారథిగా వ్యవహరించిన సాహిబ్‌జాదా ఫర్హాన్‌కు పూర్తి స్థాయి టీ20 కెప్టెన్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. త్వరలో స్వదేశంలో శ్రీలంకతో జరిగే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో ఫర్హాన్ ఛార్జ్ తీసుకుంటాడు. ఇప్పటివరకు పాక్ టీ20 కెప్టెన్‌గా సల్మాన్ అఘా వ్యవహరించాడు. శ్రీలంకతో టీ20 సిరీస్ అక్టోబర్ 9, 11, 13 తేదీల్లో జరుగుతుంది. ఈ సిరీస్ కోసం పాక్ జట్టును కూడా ప్రకటించారు. ఈ జట్టులో స్టార్ ప్లేయర్లు బాబర్ ఆజమ్, షాహీన్ షా అఫ్రిదికి చోటు దక్కలేదు. అయితే ఈ ఇద్దరినీ ఆతర్వాత పాక్‌లోనే జరిగే వన్డే ట్రై సిరీస్‌కు ఎంపిక చేశారు. ఈ ట్రై సిరీస్ అక్టోబర్ 18 నుంచి ప్రారంభమవుతుంది. ఈ టోర్నీలో పాక్, శ్రీలంకతో పాటు ఇంగ్లండ్ పాల్గొంటుంది. వన్డే టోర్నీలో పాక్ కెప్టెన్‌గా షాహీన్ అఫ్రిది వ్యవహరిస్తాడు.

# డబ్ల్యూసీఎల్ నుంచి పాక్ అవుట్

వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీ మూడవ సీజన్ నుంచి పాకిస్థాన్ చాంపియన్స్ జట్టు తప్పుకున్నది. టోర్నీలో పాల్గొనేందుకు పాకిస్థాన్ బోర్డు అనుమతి ఇవ్వలేదని తెలిసింది. అయితే దీని వెనుక ఓ కారణం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. డబ్ల్యూసీఎల్ నిర్వాహకులకు పీసీబీ కొన్ని షరతులు పెట్టింది. ఆ షరతులను డబ్ల్యూసీఎల్ అంగీకరించలేదు. దీంతో టోర్నీ నుంచి తప్పుకుంటున్నట్లు పాక్ ప్రకటించింది. గత ఏడాది పెహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఇండో, పాక్ క్రికెటర్లు ఏ మ్యాచ్‌లో ఆడినా.. షేక్‌హ్యాండ్ ఇచ్చుకోవడం లేదు. అయితే భారత క్రికెటర్లు షేక్ హ్యాండ్ ఇవ్వాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తన షరతులో కోరినట్లు తెలుస్తోంది. గత ఏడాది జరిగిన ఘటన పట్ల క్షమాపణ కూడా చెప్పాలని పీసీబీ డిమాండ్ చేసింది. ఆ షరతులకు నిర్వాహకులు అంగీకరించకపోవడంతో.. పాక్ జట్టుకు పీసీబీ ఎన్వోసీ ఇవ్వలేదు. వాస్తవానికి టోర్నమెంట్ అక్టోబర్ 3నే ప్రారంభమైంది. ఇప్పటికే బంగ్లాదేశ్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను పాకిస్థాన్ మిస్సైంది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 10వ తేదీన ఇండియా, పాక్ తలపడాల్సి ఉన్నది. కానీ పాక్ తప్పుకోవడంతో ఆ మ్యాచ్ లేనట్లే.

# భారత్, విండీస్‌కు మ్యాచ్ ఫీజులో భారీ కోత

వన్డే సిరీస్ ముగియడంతో పొట్టి ఫార్మాట్‌కు సిద్ధమవుతున్న భారత్, వెస్టిండీస్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి షాకిచ్చింది. నామమాత్రమైన మూడో వన్డేలో ఐసీసీ కోడ్ ఉల్లంఘించినందుకు ఇరుజట్లకు జరిమానా విధించింది. ముల్లన్‌పూర్ మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయనుందకు టీమిండియా, విండీస్ మ్యాచ్ ఫీజులో కోత పెట్టింది. స్వదేశంలో వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్‌కు భారీగా జరిమానా పడింది. ఓదార్పు విజయంతో



ఊపిరి పీల్చుకున్న వెస్టిండీస్‌కు కూడా ఫైన్ విధించింది ఐసీసీ. అక్టోబర్ 3, శనివారం ముల్లన్‌పూర్ వన్డేలో ఇరుజట్లు కోడ్ ఉల్లంఘనకు పాల్పడడమే అందుకు కారణం. ఆ మ్యాచ్‌లో తొలుత విండీస్, ఆపై టీమిండియా నిర్ణీత సమయంలో ఓవర్ల కోటా పూర్తి చేయలేదు. స్లో ఓవర్ రేటును గమనించిన రిఫరీ ప్రకాశ్ భట్ ఇరుజట్లు ఐసీసీ ఆర్టికల్ 2.22 నియమాన్ని అతిక్రమించాయని తెలిపారు.




# నేడే విండీస్‌తో తొలి టీ20




## భారీ రికార్డులపై కన్నేసిన అభిషేక్ శర్మ

భారత్–వెస్టిండీస్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ రేపటి నుంచి ప్రారంభం కానుంది. లక్నో వేదికగా తొలి మ్యాచ్ మంగళవారం రాత్రి 7 గంటలకు మొదలవుతుంది. ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మను పలు భారీ రికార్డులు ఊరిస్తున్నాయి. ఆ మ్యాచ్‌లో అభిషేక్ 74 పరుగులు చేస్తే, అంతర్జాతీయ టీ20ల్లో 2000 పరుగుల మార్కును తాకుతాడు. తద్వారా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్ తర్వాత ఈ మైలురాయిని తాకిన ఆరో భారత బ్యాటర్‌గా నిలుస్తాడు. 2024లో జింబాబ్వే మ్యాచ్‌తో టీ20 అరంగేట్రం చేసిన అభిషేక్, ఇప్పటివరకు 61 ఇన్నింగ్స్‌ల్లో 1926 పరుగులు చేశాడు. టీ20ల్లో ఇప్పటివరకు 185 ఫోర్లు బాదిన అభిషేక్.. రేపటి మ్యాచ్‌లో మరో ఏడు ఫోర్లు కొడితే భారత్ తరఫున అత్యధిక ఫోర్లు బాదిన ఆటగాళ్ల జాబితాలో కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్‌లను అధిగమిస్తాడు. వీరిద్దరూ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 191 ఫోర్లు సాధించారు. సొంతగడ్డపై టీ20ల్లో అభిషేక్ శర్మ రికార్డు ఆకట్టుకునేలా ఉంది. భారత్‌లో ఇప్పటివరకు 969 పరుగులు చేసిన అతడు, రేపటి మ్యాచ్‌లో మరో 31 పరుగులు చేస్తే స్వదేశంలో 1000 టీ20 అంతర్జాతీయ పరుగులు పూర్తి చేస్తాడు. తద్వారా విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, ఇషాన్ కిషన్, కేఎల్ రాహుల్ తర్వాత ఈ మైలురాయిని తాకిన ఏడో భారత బ్యాటర్‌గా నిలుస్తాడు.




# భువీకి పిలుపు

భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌కు బంపర్ ఆఫర్ వచ్చింది. ఫ్రాంచైజీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్న అతడు ఏకంగా టీమిండియాకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అలాఅనీ బీసీసీఐ, సెలెక్టర్లు భువిని సారథిగా ప్రకటించలేదు. మరి ఇదెలా సాధ్యం? అని ఆశ్చర్యపోతున్నారా. మీరు నోరెళ్లబెడుతున్నట్టు.. ఇండియాలో కాదు విదేశీ లీగ్‌లో భారత బృందానికి వెటరన్ స్పీడ్‌స్టర్ కెప్టెన్సీ వహించనున్నాడు. హాంకాంగ్ సిక్సెస్–2026 ఎడిషన్ కోసం ప్రకటించిన భారత స్క్వాడ్‌కు అతడు సారథ్యం వహించనున్నాడు. ఒకప్పుడు భారత జట్టులో ప్రధాన పేసర్‌గా కొనసాగిన భువనేశ్వర్ కుమార్ మరోమారు కీలక పాత్ర పోషించనున్నాడు. బీసీసీఐ, సెలెక్టర్ల పిలుపు కోసం మూడేళ్లకు ఎదురుచూసి అలసిపోయిన అతడికి విదేశీ లీగ్‌లో కెప్టెన్సీ దక్కింది. అది కూడా భారత బృందానికి నాయకుడిగా. హాంకాంగ్ సిక్సెస్ – 2026 ఎడిషన్ కోసం భువి సారథిగా ఎంపికయ్యాడు. ప్రతి జట్టులో ఆరుగురు మాత్రమే ఉండే ఈ టోర్నీలో.. అతడు కృనాల్ పాండ్యా, నటరాజన్, త్రిపాఠి, తెవాటియా, నితీశ్, శశాంక్ సింగ్‌లతో కూడిన బృందాన్ని నడిపించనున్నాడు.

**భారత స్క్వాడ్: భువనేశ్వర్ కుమార్(కెప్టెన్), కృనాల్ పాండ్యా, శశాంక్ సింగ్, రాహుల్ తెవాటియా, నితీశ్ రానా, రాహుల్ త్రిపాఠి, టి.నటరాజన్**

# కుంకుమ్, సుజీత్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డులు

ఆసియా క్రీడల్లో పతకాలతో మెరిసిన భారత అథ్లెట్లపై ప్రశంసలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఆర్చరీ, రెజ్లింగ్‌లో అసమాన ప్రతిభ కనబరిచిన ఇద్దరు ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. నగోయలో స్వర్ణం గెలుపొందిన 17 ఏళ్ల ఆర్చర్ కుంకుమ్ మొహద్.. పసిడిని పట్టేసిన కుస్తీ యోధుడు సుజీత్ కల్కల్ తొలిసారి ప్రవేశపెట్టిన అవార్డులు గెలుచుకున్నారు. కుంకుమ్.. జస్పాల్ రాణా పురస్కారానికి ఎంపికవ్వగా, రాజా రణ్‌ధీర్ సింగ్ అవార్డు సుజీత్‌ను వరించిందని సోమవారం భారత ఒలింపిక్ సంఘం ప్రకటించింది. ఐచీ – నగోయ వేదికగా జరిగిన 18వ ఆసియా క్రీడల్లో అసాధారణ ప్రదర్శనతో స్వర్ణ కాంతులు విరజిమ్మిన కుంకుమ్ మొహద్(ఆర్చర్), సుజీత్ కల్కల్ (రెజ్లర్)లకు మరో గౌరవం దక్కింది. భారత క్రీడా దిగ్గజాలు దివంగత జస్పాల్ రాణా, రాజా రణ్‌ధీర్ సింగ్‌ల పేరుతో తొలిసారి ఏర్పాటు చేసిన అవార్డులకు వీరిద్దరు ఎంపికయ్యారు.

'అరంగేట్రం ఆసియాడ్‌లోనే రికర్వ్ ఆర్చరీలో గోల్డ్ మెడల్ కొల్లగొట్టిన 17 ఏళ్ల కుంకుమ్.. జస్పాల్ రాణా అవార్డును గెలుచుకోగా.. పురుషుల 65 కిలోల ఫ్రీ స్టయిలో విభాగంలో పసిడిని అందించిన 23 ఏళ్ల సుజీత్‌కు రాజా రణధీర్ సింగ్ అవార్డు దక్కింది' అని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష పేర్కొంది.




# ఢిల్లీ అండర్ 19 కెప్టెన్‌గా సెహ్వాగ్ కొడుకు

భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కొడుకు ఆర్యవీర్ సెహ్వాగ్‌కు క్రికెట్‌లో ప్రమోషన్ వచ్చింది. 2026–27 దేశవాళీ సీజన్‌లో జరిగే వినూ మన్కడ్ టోర్నీకి ఢిల్లీ అండర్–19 జట్టు కెప్టెన్‌గా ఆర్యవీర్‌ను ఎంపిక చేశారు. 18 ఏళ్ల ఆర్యవీర్ ఇటీవలే భారత అండర్–19 జట్టులోకి అరంగేట్రం చేశాడు. ఆస్ట్రేలియా అండర్–19 జట్టుతో జరిగిన మూడు మ్యాచ్‌ల యూత్ వన్డే సిరీస్‌లో ఆర్యవీర్ 28, 47, 34 పరుగులు చేశాడు. ఈ సిరీస్‌ను భారత్ 3–0 తో గెలిచింది. మూడు మ్యాచ్‌లలోనూ మంచి ఆరంభాలు ఇచ్చినప్పటికీ భారీ స్కోర్లు చేయలేకపోయానని ఆర్యవీర్ చెప్పాడు. భారత అండర్–19 జట్టుతో ఆడిన అనుభవం తనకు కీలక పాఠాలు నేర్పిందని తెలిపాడు. మ్యాచ్‌ను వివిధ దశలుగా విభజించుకుని ఆడాలని, భారీ పరుగులు చేయాలంటే ఎక్కువసేపు క్రీజులో నిలవాలని తెలుసుకున్నానని చెప్పాడు.



# హైదరాబాద్‌లో ధోనీ '7పాడెల్'

భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ హైదరాబాద్‌లో సందడి చేశారు. జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన '7పాడెల్ ఎంఎస్ ధోనీ' పాడెల్, ఫిట్‌నెస్, వెల్‌నెస్ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారీ దిగ్గజం. సుమారు 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో పూర్తిగా ఇండోర్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో మూడు పాడెల్ కోర్టులు, జిమ్, రికవరీ సూట్, సౌనా, ఐస్ బాత్, ఇన్‌ఫ్రారెడ్ గది, యోగా, పైలేట్స్ స్టూడియో తదితర సదుపాయాలు ఉన్నాయి. '7పాడెల్ ఎంఎస్ ధోనీ' ఫిట్‌నెస్, వెల్‌నెస్ కేంద్రం ప్రారంభం సందర్భంగా ఎంఎస్ ధోనీ మాట్లాడుతూ.. "ఒక క్రీడను అభివృద్ధి చేసేందుకు అడ్డదారులు ఉండవు. మంచి కోర్టులను నిర్మించాలి. ఆడేవారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలి. క్రీడల్లో రాణించాలి అనుకునే ప్రతి ఒక్కరికీ అవకాశం ఇవ్వాలి.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# ప్రభుత్వాలకు పట్టని సామాన్యుడి కుంపటి

ధరలు పెరగడం ఇప్పుడు వార్త కాదు.. పెరగని ధర ఏదైనా ఉందా అన్నదే వార్తగా మారుతోంది. నిత్యావసర సరుకుల నుంచి కూరగాయల వరకు.. వంటనూనె నుంచి పప్పుల వరకు.. విద్యుత్ బిల్లు నుంచి ఇంటి అద్దె వరకు.. పిల్లల చదువు నుంచి వైద్యం వరకు.. సామాన్యుడి జీవితం ప్రతి అడుగులోనూ ఖర్చుల కుంపటిలో కాలుతోంది. ఆదాయం మాత్రం అదే స్థాయిలో ఉంటే.. ఖర్చులు మాత్రం రోజుకో మెట్టు ఎక్కుతున్నాయి. ఫలితంగా నెల జీతం చేతికి రాకముందే ఎక్కడికి పోతుందో తెలియని పరిస్థితి. ఒకప్పుడు మధ్యతరగతి కుటుంబం నెలవారీ ఖర్చుల కోసం బడ్జెట్ వేసుకునేది. ఇప్పుడు బడ్జెట్ వేయడం కాదు.. ఏ ఖర్చును తగ్గించుకోవాలో ఆలోచించుకోవాల్సిన పరిస్థితి. కూరగాయలు ఖరీదైతే పప్పులు తగ్గించుకోవాలి. పప్పులు పెరిగితే పండ్లు మానేయాలి. పిల్లల చదువుకు ఖర్చు పెరిగితే కుటుంబ అవసరాల్లో కోత పెట్టాలి. వైద్య ఖర్చు వస్తే అప్పు చేయాలి. ఇలా సామాన్యుడి జీవితంలో 'అవసరం' అనే పదానికి అర్థమే మారిపోతోంది. ధరలు పెరిగినప్పుడల్లా కారణాలు అనేకం వినిపిస్తాయి. ఉత్పత్తి తగ్గింది.. రవాణా ఖర్చులు పెరిగాయి.. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నాయి.. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం ఉంది.. సరఫరాలో అంతరాయం ఏర్పడింది.. ఇలా కారణాలు చెప్పడానికి కొదవ ఉండదు. కానీ సామాన్యుడికి కావాల్సింది కారణాల జాబితా కాదు.. ఉపశమనం. ప్రభుత్వాలు ఆర్థిక వృద్ధి గురించి మాట్లాడతాయి. పెట్టుబడుల గురించి చెబుతాయి. అభివృద్ధి గణాంకాలను వివరిస్తాయి. దేశం, రాష్ట్రం పురోగమిస్తున్నాయని ప్రకటిస్తాయి. కానీ ఆ పురోగతి సామాన్యుడి వంటింట్లో కనిపిస్తోందా? అతని జేబులో కనిపిస్తోందా? నెలాఖరుకు మిగిలే డబ్బులో కనిపిస్తోందా? అన్న ప్రశ్నలకు సమాధానం కావాలి. ధరల భారాన్ని కేవలం ద్రవ్యోల్బణ గణాంకాల్లో చూసే పరిస్థితి మారాలి. ఒక కుటుంబం నెలకు ఎంత ఖర్చు చేస్తోంది? ఆ కుటుంబ ఆదాయంలో ఆహారం, విద్య, వైద్యం, రవాణా, ఇల్లు వంటి అవసరాలకు ఎంత శాతం వెళ్తోంది? ధరల పెరుగుదల వల్ల తక్కువ ఆదాయ వర్గాలు ఏ అవసరాలను వదులుకుంటున్నాయి? అన్నదే అసలు ప్రశ్న. సామాన్యుడి కష్టాన్ని అర్థం చేసుకోవాలంటే ప్రభుత్వాలు ఒకసారి గణాంకాల పుస్తకాలను పక్కన పెట్టి.. సామాన్యుడి ఇంటి వంటగదిలోకి తొంగిచూడాలి. మార్కెట్‌కు వెళ్లి ఒక కుటుంబానికి వారానికి కావాల్సిన సరుకులు కొనాలి. నెల జీతంతో ఇల్లు నడిపి చూడాలి. పిల్లల పాఠశాల ఫీజు, ఇంటి అద్దె, కరెంటు బిల్లు, మందుల ఖర్చు, ప్రయాణ వ్యయం చెల్లించి చివరికి చేతిలో ఎంత మిగులుతుందో చూడాలి. అప్పుడు మాత్రమే ధరల కుంపటి ఎంత వేడిగా ఉందో తెలుస్తుంది. మరోవైపు రైతుకూ ఇదే బాధ. వినియోగదారుడికి ధరలు పెరిగినా.. ఆ ధరల ప్రయోజనం చాలాసార్లు రైతుకు పూర్తిగా చేరదు. ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఎరువులు, విత్తనాలు, కూలీ, విద్యుత్, రవాణా ఖర్చులు పెరుగుతాయి. మార్కెట్‌లో వినియోగదారుడు అధిక ధర చెల్లించినా.. రైతు చేతికి అందే ధర మాత్రం ఆశించినంతగా ఉండకపోవచ్చు. మధ్యలోని సరఫరా వ్యవస్థలో లోపాలు సరిచేయకుండా ధరల సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యం కాదు. ధరల నియంత్రణ అంటే మార్కెట్‌ను బలవంతంగా అణచివేయడం కాదు. ఉత్పత్తి, నిల్వ, రవాణా, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడం. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతలకు అడ్డుకట్ట వేయడం. రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి అందుబాటు ధర మధ్య సమతుల్యత సాధించడం. అవసరమైన సమయంలో మార్కెట్‌లో ప్రభుత్వ జోక్యాన్ని సమర్థంగా ఉపయోగించడం. అన్నింటికంటే ముఖ్యంగా.. ప్రజల ఆదాయం పెరగాలి. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పెరగాలి. చిన్న వ్యాపారాలు బలపడాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించాలి. జీతాలు, ఆదాయాలు పెరగకుండా కేవలం ధరలను నియంత్రించాలనుకోవడం కూడా పూర్తి పరిష్కారం కాదు. ఎన్నికల సమయంలో సామాన్యుడు కేంద్రబిందువుగా మారుతాడు. అతని ఓటు కోసం హామీలు వెల్లువెత్తుతాయి. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత అదే సామాన్యుడి వంటింటి బడ్జెట్ ఎందుకు ప్రభుత్వాల ప్రాధాన్యాల్లో కనిపించదు? అతని జేబుపై పడుతున్న భారాన్ని కొలిచే విధానాలు ఎందుకు అంతగా చర్చకు రావు?

## అన్నం ముద్ద..



# అన్నదాత యాదిలో..!



ఆహార నష్టాలను తగ్గించడం ద్వారా ఆహార భద్రతను బలోపేతం చేయడంతో పాటు సహజ వనరులను పరిరక్షించవచ్చు, వాతావరణ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లవచ్చు.

**- కొండా రెడ్డి చవ్వా, భారతదేశంలోని ఎఫ్ఏఓ ప్రతినిధి కార్యాలయ ఇన్‌చార్జి అధికారి**

ఆహార నష్టం, ఆహార వ్యర్థాలు ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత సుదీర్ఘమైన సవాళ్లలో ఒకటి. వీటి ప్రభావం వాతావరణ మార్పులు, ఆహార భద్రత, ఆర్థిక వ్యయాలు, సహజ వనరుల సుస్థిర వినియోగంపై తీవ్రంగా పడుతోంది. 140 కోట్ల జనాభాకు సరిపడా ఆహారాన్ని ఉత్పత్తి చేసే సామర్థ్యం భారతదేశానికి ఉన్నప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తుల్లో గణనీయమైన భాగం ఉత్పత్తి నుంచి వినియోగదారుడి వరకు జరిగే సరఫరా గొలుసులోనే నష్టపోతోంది. మరింత స్థిరమైన, సుస్థిరమైన, సమర్థవంతమైన వ్యవసాయ-ఆహార వ్యవస్థల వైపు భారత్ ముందుకు సాగుతున్న నేపథ్యంలో ఆహార నష్టం, ఆహార వ్యర్థాలను తగ్గించడం ద్వారా మూడు కీలక ప్రయోజనాలను సాధించవచ్చు. అవి ఆహార భద్రత, పోషకాహారాన్ని బలోపేతం చేయడం; సహజ వనరులపై ఒత్తిడిని, ఉద్గారాలను తగ్గించడం; రైతులు, వ్యాపారులు, ఇతర భాగస్వాముల ఆదాయాన్ని, ఉత్పాదకతను పెంచడం. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న నిర్వహించే అంతర్జాతీయ ఆహార నష్టం, వ్యర్థాలపై అవగాహన దినోత్సవం ఈ అవకాశాన్ని భారతదేశానికి మరోసారి గుర్తుచేస్తోంది. భారతదేశం ఇప్పటికే తొలి అడుగు వేసింది. జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే గణాంకాలను సేకరించడం ద్వారా భారతదేశం ఇప్పటికే కీలకమైన తొలి అడుగు వేసింది. భారతదేశ ఆధారాలు - ప్రపంచంలోనే ప్రత్యేకమైనవి. పంట కోత అనంతర నష్టాలపై మూడు జాతీయ స్థాయి సర్వేలను నిర్వహించిన ఏకైక దేశంగా భారతదేశం నిలిచింది. కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ 2005-07, 2012-14, 2020-22 కాలాల్లో వరుసగా 45, 45, 54 రకాల వ్యవసాయ, ఆహార ఉత్పత్తులపై నష్టాలను అంచనా వేసింది. ఈ సర్వేలు రైతు పొలం నుంచి చిల్లర విక్రయ కేంద్రం వరకు మొత్తం సరఫరా గొలుసును పరిగణనలోకి తీసుకున్నాయి. ప్రస్తుతం నాలుగో విడత సర్వే నిర్వహణ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఈ నిరంతర ప్రయత్నం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కింద రూపొందించిన ఆహార నష్టం సూచికకు భారతదేశం నివేదించే గణాంకాలకు బలమైన ఆధారంగా నిలుస్తోంది. అయితే ఈ అంచనాలు ప్రధానంగా పొలం, పంట కోత అనంతర దశ, సరఫరా గొలుసులో జరిగే నష్టాలపై దృష్టి సారిస్తున్నాయి. చిల్లర మార్కెట్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, కుటుంబాల స్థాయిలో జరిగే ఆహార వ్యర్థాలపై సమాచారం మాత్రం ఇంకా పరిమితంగానే ఉంది. భారతదేశంలోని వ్యవసాయ-ఆహార వ్యవస్థలలో ఈ మూడు ప్రయోజనాలను ఆచరణలోకి తీసుకురావడానికి ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ప్రభుత్వం, పరిశోధనా సంస్థలు, ఆర్థిక సంస్థలతో కలిసి పనిచేస్తోంది.

ఆహారం నష్టపోతే, ఆ ఆహారాన్ని ఉత్పత్తి చేయడానికి ఉపయోగించిన నీరు, భూమి, శక్తి, శ్రమ వంటి వనరులు కూడా వృథా అవుతాయి. కాబట్టి ఆహార నష్టాలను తగ్గించడం ద్వారా భారతదేశం వాతావరణ లక్ష్యాలను, వనరుల సమర్థ వినియోగ లక్ష్యాలను సాధించడంతో పాటు ఆహార భద్రతను బలోపేతం చేయగలదు. నష్టాలను తగ్గించేందుకు అత్యధిక అవకాశాలు మెరుగైన నిల్వ వ్యవస్థలు, ఎండబెట్టే సాంకేతికతలు, శీతలీకరణ సదుపాయాలు, తేమ నియంత్రణ, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాల్లో ఉన్నాయి. సరఫరా గొలుసులో ఆహార ఉత్పత్తులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నాయి, వాటిని ఎలా నిర్వహిస్తున్నారు అనే విషయాలను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు డిజిటల్ సాంకేతికతలు, ఉత్పత్తి ప్రయాణాన్ని గుర్తించే వ్యవస్థలు కూడా ఉపయోగపడతాయి. ఆహార నష్టం, ఆహార వ్యర్థాలను వ్యవసాయ ప్రణాళికలు, ఆహార ప్రాసెసింగ్ వ్యూహాలు, వాతావరణ కార్యాచరణ ప్రణాళికలు, పెట్టుబడి నిర్ణయాల్లో మరింత వ్యవస్థీకృతంగా భాగం చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం అత్యధిక ప్రభావం చూపగల సాంకేతికతలు, మౌలిక సదుపాయాల వైపు ఆర్థిక వనరులను మళ్లించాలి. అదే సమయంలో రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, చిన్న వ్యాపార సంస్థలకు ఈ పరిష్కారాలు అందుబాటులో ఉండేలా, భరించగలిగేలా చర్యలు తీసుకోవాలి. చక్రీయ ఆర్థిక విధానాలు మరో ముఖ్యమైన అవకాశాన్ని అందిస్తాయి. మిగులు ఆహారాన్ని అవసరమైన వారికి పునర్వినియోగం చేయవచ్చు. తప్పనిసరిగా మిగిలిపోయే సేంద్రియ పదార్థాలను కంపోస్టు, జీవవాయువు, ఇంధనం వంటి రూపాల్లోకి మార్చవచ్చు. దీనివల్ల వ్యర్థాలను తగ్గించడమే కాకుండా అదనపు ఆర్థిక విలువను కూడా సృష్టించవచ్చు. ఎఫ్ఏఓ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ బోర్డ్స్ (కోసాంబ్) నిర్వహించిన అంచనాల ప్రకారం, ప్రధాన టోకు మార్కెట్లలో రోజుకు 100 టన్నుల వరకు సేంద్రియ వ్యర్థాలు ఉత్పత్తి కావచ్చు. కొన్ని నగరాల్లో పట్టణ సేంద్రియ వ్యర్థాల్లో ఐదో వంతు వరకు వ్యర్థాలను పల్లపు ప్రదేశాలకు తరలించే కేంద్రాలకు చేరుతున్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఇది సంవత్సరానికి సుమారు 35 లక్షల టన్నుల సేంద్రియ



**- డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**

**కాకతీయ విశ్వవిద్యాలయం**

వ్యర్థాలకు సమానంగా ఉంటుంది. ఇలాంటి వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించకపోతే అవి మీథేన్ వంటి హరితగృహ వాయువుల ఉద్గారాలకు కారణమవుతాయి. వాటిని సమర్థవంతంగా వినియోగిస్తే ఉద్గారాలను తగ్గించడంతో పాటు కంపోస్టు, జీవవాయువు వంటి విలువైన ఉత్పత్తులను తయారు చేయవచ్చు.

గుజరాత్‌లోని సూరత్‌లో రోజుకు 50 టన్నుల సామర్థ్యం కలిగిన జీవ-సీఎన్‌జీ ప్లాంట్‌ను ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో ఐదేళ్లకు పైగా నిర్వహిస్తున్నారు. ఈ ప్లాంట్ ద్వారా మీథేన్‌కు సంబంధించిన ఉద్గారాలు సంవత్సరానికి సుమారు 7,500 టన్నుల మేర తగ్గుతున్నట్లు సమాచారం. ఇలాంటి నమూనాలను ప్రతి ప్రాంతంలోని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించవచ్చు. వివిధ మార్కెట్లలో ఉండే పంటలు, ఆహార ఉత్పత్తుల రకాలు, మౌలిక సదుపాయాలను పరిగణనలోకి తీసుకుని పరిష్కారాలను రూపొందించాలి. పురపాలక సంస్థలు, మార్కెట్ కమిటీలు సేంద్రియ వ్యర్థాలను వేరు చేయడం, సేకరించడం, శుద్ధి చేయడం వంటి చర్యలను మెరుగుపరచాలి. అదే సమయంలో కంపోస్టు, జీవవాయువు, పునర్వినియోగ పదార్థాలకు మార్కెట్లను అభివృద్ధి చేయాలి.

ఆహారం కేవలం మనిషి జీవించడానికి అవసరమైన పదార్థం మాత్రమే కాదు. ఒక గింజ మన భూమి, నీరు, రైతు శ్రమ, ప్రకృతి వనరులు, శక్తి, రవాణా, సాంకేతికత, మార్కెట్ వ్యవస్థలు, వినియోగదారుల అవసరాలు కలిసిన సమగ్ర జీవన ప్రక్రియకు ప్రతీక. ఒక కిలో బియ్యం, ఒక కిలో పండ్లు, ఒక కిలో కూరగాయలు మన చేతికి చేరేలోపు వాటి వెనుక అనేక దశల్లో మనిషి శ్రమ, ప్రకృతి వనరులు వినియోగించబడతాయి. అలాంటి ఆహారం పొలంలోనే నష్టపోయినా, నిల్వలో పాడైనా, రవాణాలో దెబ్బతిన్నా, మార్కెట్లో అమ్ముడుపోకపోయినా, హోటల్‌లో మిగిలిపోయినా, చివరకు ఇంటి చెత్తబుట్టలో పడిపోయినా అది కేవలం ఆహార నష్టం కాదు. దాని వెనుక వినియోగించిన నీరు, భూమి, విద్యుత్, ఇంధనం, శ్రమ, పెట్టుబడి అన్నీ కూడా వృథా అవుతున్నాయి. అందువల్ల ఆహార నష్టం, ఆహార వ్యర్థాల సమస్యను కేవలం చెత్త నిర్వహణ సమస్యగా చూడటం సరైనది కాదు. ఇది ఆహార భద్రత, ఆర్థిక వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ, రైతు ఆదాయం, ప్రజారోగ్యం, వాతావరణ మార్పులు, సహజ వనరుల భవిష్యత్తుతో ముడిపడిన జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశం. భారతదేశం వంటి విస్తారమైన జనాభా కలిగిన దేశంలో ఈ సమస్యకు మరింత ప్రాధాన్యత ఉంది. దేశం ఆహార ఉత్పత్తిలో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, ఉత్పత్తి చేసిన ఆహారం ప్రతి దశలో సమర్థవంతంగా వినియోగదారుడికి చేరేలా చేయడం ఇంకా పెద్ద సవాలుగానే ఉంది. ఒకవైపు రైతులు పంటకు సరైన ధర రాక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మరోవైపు కొన్ని ప్రాంతాల్లో పంటలు మార్కెట్‌కు చేరకముందే పాడైపోవడం ఒక విరుద్ధ పరిస్థితిని సృష్టిస్తోంది. మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో పంటను కోయడం కంటే పొలంలోనే వదిలేయాల్సిన పరిస్థితులు కూడా కొన్ని సందర్భాల్లో కనిపిస్తాయి. మరికొన్ని సందర్భాల్లో నిల్వ సదుపాయాలు లేక రైతులు తక్కువ ధరకు ఉత్పత్తులను విక్రయించాల్సి వస్తుంది. ఈ సమస్యకు పరిష్కారం కేవలం అధిక ఉత్పత్తి కాదు. ఉత్పత్తి చేసిన ప్రతి యూనిట్ ఆహారం సురక్షితంగా, నాణ్యతతో, సరైన సమయంలో, సరైన ధరకు వినియోగదారుడికి చేరేలా చేసే సమగ్ర వ్యవస్థ అవసరం.

పట్టణ ప్రాంతాల్లో ఆహార వ్యర్థాల సమస్యను మరింత తీవ్రంగా పరిగణించాలి. హోటళ్లు, రెస్టారెంట్లు, వివాహ వేడుకలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, కార్యాలయాలు, సూపర్ మార్కెట్లు, కుటుంబాలు వంటి అనేక ప్రాంతాల్లో ప్రతిరోజూ గణనీయమైన పరిమాణంలో ఆహారం మిగిలిపోతుంది. తినదగిన మిగులు ఆహారాన్ని సురక్షితంగా సేకరించి అవసరమైన వారికి అందించే వ్యవస్థలను బలోపేతం చేయాలి. తినడానికి అనుకూలంగా లేని సేంద్రియ వ్యర్థాలను వేరుగా సేకరించి కంపోస్టు, జీవవాయువు, జీవ ఇంధనం వంటి ఉపయోగకరమైన ఉత్పత్తులుగా మార్చాలి. ఆహార వ్యర్థాలను ఇతర చెత్తతో కలిపి పల్లపు ప్రాంతాలకు తరలించడం సమస్యను మరింత పెంచుతుంది. మూలస్థాయిలోనే వ్యర్థాలను వేరు చేయడం ద్వారా దాని నుంచి విలువను సృష్టించే అవకాశాలు పెరుగుతాయి. అయితే ఈ మార్పు ప్రభుత్వాల ఒక్క బాధ్యత కాదు. రైతు నుంచి వినియోగదారుడి వరకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం. వినియోగదారులు అవసరానికి మించి ఆహారం కొనకుండా, సరైన విధంగా నిల్వ చేసి, మిగిలిన ఆహారాన్ని సురక్షితంగా వినియోగించి, వ్యర్థాలను వేరు చేయడం వంటి చిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దోహదపడతాయి. కుటుంబాల్లో పిల్లలకు ఆహారం విలువను, రైతు శ్రమను, నీటి ప్రాధాన్యతను చిన్న వయసు నుంచే తెలియజేయాలి. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఆహార నష్టం, వనరుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. ప్రజల ప్రవర్తనలో మార్పు లేకుండా కేవలం మౌలిక సదుపాయాలతోనే ఆహార వ్యర్థాలను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాదు. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు, డిజిటల్ పర్యవేక్షణ, వాతావరణ అంచనాలు, పంట నాణ్యత గుర్తింపు, స్మార్ట్ నిల్వ వ్యవస్థలు, సరఫరా గొలుసు పర్యవేక్షణ వంటి ఆధునిక సాంకేతికతలను కూడా ఆహార నష్టం తగ్గించేందుకు ఉపయోగించవచ్చు. అయితే సాంకేతికత ఖరీదైనదిగా ఉండి చిన్న రైతులకు అందుబాటులో లేకపోతే దాని ప్రయోజనం పరిమితమవుతుంది. కాబట్టి సాంకేతిక పరిజ్ఞానం చౌకగా, సులభంగా, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి నిల్వ, ప్రాసెసింగ్, రవాణా, వ్యర్థాల నిర్వహణ రంగాల్లో ఉపాధి అవకాశాలను కూడా సృష్టించవచ్చు. అంతిమంగా చూస్తే ఆహార నష్టం తగ్గించడం అంటే కేవలం ఆహారాన్ని కాపాడటం కాదు; రైతు శ్రమను గౌరవించడం, నీటిని ఆదా చేయడం, భూమిని సంరక్షించడం, శక్తిని పొదుపు చేయడం, కుటుంబ ఖర్చును తగ్గించడం, పర్యావరణాన్ని రక్షించడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, భవిష్యత్ తరాలకు వనరులను అందుబాటులో ఉంచడం. ఒకవైపు ఆకలి, పోషకాహార లోపం వంటి సమస్యలు కొనసాగుతుండగా మరోవైపు తినదగిన ఆహారం వ్యర్థం కావడం సమాజం ముందున్న తీవ్రమైన వైరుధ్యం. ఈ వైరుధ్యాన్ని తొలగించడానికి ఉత్పత్తి నుంచి వినియోగం వరకు ప్రతి దశలో బాధ్యతాయుతమైన వ్యవస్థ అవసరం.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004